# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ సోమవారం | 16 జూన్ 2025 | ■ 13 పేజీలు





## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

■ అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు ■ రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్..






# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు

- సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల అడుగులు
- అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ఫలాలు
- విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత
- రాష్ట్ర గనులు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్



**మంచిర్యాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని మందమర్రి మండలం సండ్రన్ పల్లి గ్రామంలోని కె. ఆర్. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో సంవత్సరానికి 3 వేల 500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఉచితంగా ఇసుకను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో నాలుగు సంవత్సరాలలో 15 వేల ఇండ్లు అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు అర్హులైన నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటి స్థలం కలిగి ఉండి ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ది పొందే లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు గజములలోపు ఇల్లు నిర్మించుకోవాలని తెలిపారు. లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకు రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. గతంలో 5 లక్షల రూపాయల పరిమితి ఉన్న రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని, ప్రజల ఆరోగ్యం లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు తమ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన డైట్ మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంతో పాటు విద్యార్థుల కొరకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయరంగ అభివృద్ధిలో భాగంగా గతంతో పోలిస్తే 70 శాతం అధికంగా పంట ఉత్పత్తి జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక మాఫియాను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రత్యేక ఇసుక రీచ్ లను ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం వినియోగదారులకు అందించడం జరుగుతుందని, ఇసుక అక్రమ రవాణా నిరోధించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గానికి కేటాయించిన 3 వేల 500 ఇందిరమ్మ ఇండ్లను అర్హత గల నిరుపేద లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం తలపెట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుండి 2 వేల 500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి అర్హత గల అభ్యర్థులకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 419 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు భీమా పథకం క్రింద 6 మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మండల పరిషత్ అభివృద్ధి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి
- సీఐటీయు జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్




**జన్నారం, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలో తెలంగాణ బీడి, సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో దాసండ్ల రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకు దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల మంది కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత బీడీ పరిశ్రమ అతి పెద్దది. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కాపాడాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ పరిశ్రమను ధ్వంసం చేయడానికే కోస్టా చట్టం-2023ని తీసుకొచ్చింది. బీడీ కార్మికుల ఉపాధిని హరించే ఈ చట్టాన్ని ఉపసంహరించు కోవాలని సిఐటియు డిమాండ్. చేస్తున్నది. కోటపా చట్టం- 2023 ప్రతిపాదించిన సవరణల ప్రకారం బీడీ కట్టలపై ఉత్తర్వుల గురించి ఉత్పత్తిదారులు ప్రచారం చేసుకోరాదు. బీడీ కట్టలు పబ్లిక్ దుకాణాల్లో ఉండరాదు. 20సం॥ఎరాల కంటే తక్కువ వయసున్న వారికి బీడీలు అమ్మడానికి వీలులేదు. లూజుబీడీలు అమ్మడానికి వీలులేదు. కట్టలు మాత్రమే అమ్మాలి. బీడీ కట్టలలో బీడీల సంఖ్యను ప్రభుత్వం నిర్దేశిస్తుంది. ఈ సవరణలు అమలు జరిగితే బీడీ అమ్మకాలు తగ్గి, కార్మికులకు ఉపాధి పోతుంది. ఇది పెద్దసంక్షోభానికి దారి తీస్తుంది. కాబట్టి కోపా చట్టం సవరణలను ఉపసంహరించుకోవాలని లేదంటే కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతున్నాం. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10సం?లు గడుస్తున్నది. 3వ సారి కూడా అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. అందుకే కేంద్ర ప్రభుత్వంపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చి చట్టం-2023ను ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీడీ వెల్ఫేర్ సెస్సు యాక్ట్ను పునరుద్ధరించాలని, కనీస పెన్షన్ ఇవ్వాలని 2025 జూలై 9న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో బీడీ కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ అంబాల లక్ష్మణ్, బుచ్చన్న సీఐటీయూ సీనియర్ నాయకులు, బీడీ కార్మికులు లక్ష్మి,సరస్వతి, సుజాత సరిత లత సువర్ణ, లావణ్య సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.



## అదిలాబాద్ ముదిరాజ్ తాత్కాలిక సంఘం కన్వీనర్ శ్రీనివాస్

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

అదిలాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం తాత్కాలిక కన్వీనర్గా దార్శ శ్రీనివాస్ను ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలో స్థానికంగా జరిగిన సమావేశంలో, హైదరాబాద్ ముదిరాజ్ మహాసభ, కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల ప్రకారం, హైదరాబాద్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోమల చంద్రమౌళి, నిర్మల్ జిల్లా అధ్యక్షులు సుంకరి పోతన్న. బైంసా పట్టణ అధ్యక్షులు పోతారం కృష్ణ. ఈ సమావేశానికి హాజరై తాత్కాలికంగా హైదరాబాద్ ముదిరాజ్ మహాసభ సమావేశాలకు అనుగుణంగా అదిలాబాద్ జిల్లాకు కన్వీనర్గా దార్శ శ్రీనివాసులు ముదిరాజ్ను నియమించడం జరిగింది. కొత్తగా జిల్లా ముదిరాజ్ సంఘం తాత్కాలిక కన్వీనర్ గా పదవి బాధ్యతలు తీసుకున్న దార్శ శ్రీనివాస్ మాట్లాడుతూ , ముదిరాజ్ సంఘం జిల్లాలో బలోపేతానికి కృషి చేస్తానని. సంఘంలో సమస్యలు పరిష్కరిస్తారని. ఐక్యంగా ఉండే విధంగా జిల్లాలో ముదిరాజులందరినీ ఒకే తాటిపై తెస్తానని. ఐక్యంగా ముందుకు వెళ్తామని. తను సంఘం కోసమే పని చేస్తానని. ఏ సమస్య ఉన్న తెలియజేయాలని పరిష్కరించే ఏర్పాటు చేస్తానని ఆయన మాట్లాడారు. అదిలాబాదులో ముదిరాజ్ సంఘం భవనం ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని దానికోసం హార్నిశలు కష్టపడతానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బండారి ఉమాపతి, అదిలాబాద్ న్యాయవాద బార్ అసోసియేషన్ సభ్యుడు సీనియర్ న్యాయవాది ముదిరాజ్ శాగంటి భగవాండ్లు. సిరవేని శివ, ప్రభాకర్. పిట్ల రమేష్, ఉపాధ్యాయులు సురేష్, పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌ను కలిసిన కలెక్టర్

**మంచిర్యాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనుల శాఖ మంత్రి, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.



### ఆర్కేపీలో కార్మిక, మైనింగ్ శాఖ

## మంత్రికి వివేక్‌కు ఘనస్వాగతం

**రామకృష్ణాపూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన గడ్డం వివేక్ వెంకటస్వామి తొలిసారి తన నియోజకవర్గంలోని సింగరేణి ప్రాంతం రామకృష్ణాపూర్ లో పర్యటించాడు. ముందుగా రెండు భారీ క్రేన్ లా సహాయంతో భారీ గజమాలతో కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. ఏరియా ఆసుపత్రిలోని కార్మికుని విగ్రహం ఆవిష్కరణ చేసి భారీ మోటార్ సైకిల్ ర్యాలీతో బయలుదేరి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. మినిస్టర్ వివేక్ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ చిరకాల కోరిక రైల్వే ఫ్లై ఓవర్ వంతెన నెరవేరడం సంతోషంగా ఉంది. నేను ఎంపీగా ఉన్నపుడు శంకుస్థాపన చేశాను, మళ్ళీ నేను ఎమ్మెల్యేగా గెలిచాక బ్రిడ్జి ప్రారంభించారు. సింగరేణి సంస్థతో త్వరలో 76 జీవో సింగరేణి పట్టా భూములు, స్మశానవాటిక వాటి గురించి చర్చలు జరుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్సీ వెంకట్రావు పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్ రెడ్డి, డీ కొండా శ్యామ్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం కళ , సీనియర్ నాయకులు గండ్ల సమ్మయ్యా, అబ్దుల్ అజీజ్, నాయకులు పాల్గొన్నారు.





# మామడ మాజీ ఎంపీపీ కిడ్నాప్ కలకలం..?



- తలుపులు బద్దలు కొట్టి ఎత్తుకెళ్లిన దుండగులు
- తూప్రాన్ టోల్‌గేట్ వద్ద తప్పించుకున్న హరీశ్
- ఆయన ఊరులోనే.. ఆయన కారులోనే..
- హరీష్ కుమార్ కిడ్నాప్ వ్యవహారం సుఖాంతం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన హరీష్ కుమార్
- పరామర్శించిన మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

**మామడ, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
మామడ మాజీ మండల అధ్యక్షుడు, ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డైరెక్టర్ చిక్యాల హరీష్ కుమార్ కిడ్నాప్ ఉదంతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తీవ్ర కలకలం రేపింది. రాజకీయాల్లో సుమారు నాలుగు దశాబ్దాలుగా ఆయన వివిధ హోదాల్లో పనిచేశారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆదివారం తెల్లవారు జామున రెండున్నర గంటలకు ఆయన స్వగ్రామం మామడ మండలం పొన్‌కల్ తన నివాసంలో నిద్రిస్తున్న హరీష్ కుమార్ నిద్రలేపి కిడ్నాప్ చేశారు. ఈ వ్యవహారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. కిడ్నాప్ వెనక బాగా తెలిసిన వ్యక్తి..? హరీష్ కుమార్‌ను కిడ్నాప్ చేసిన ముఠాలో కీలక వ్యక్తి ఆయనకు గతంలో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తిగా ప్రచారం జరుగుతున్నది. ఆయన వద్ద కొంతకాలం డ్రైవర్‌గా కూడా ఆయన పనిచేసినట్లు చెబుతున్నారు. హరీష్ కుమార్ సొంత ఊరుకు చెందిన ఆ వ్యక్తి గతంలో జరిగిన కొ న్ని వివాదాల కారణంగా హరీష్ పై కక్ష పెంచుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. హైదరాబాద్‌కు చెందిన కొందరితో కలిసి ఈ కిడ్నాప్‌కు ప్లాన్ వేసినట్లు సమాచారం.

**తప్పించుకున్న తీరుపై సర్వత్రా చర్చ...**
కిడ్నాపర్ల చెర నుంచి హరీష్ కుమార్ తప్పించుకున్న తీరు ఇప్పుడు సర్వత్ర చర్చకు దారి తీస్తున్నది. హరీష్‌ను కిడ్నాప్ చేసి తీసుకువెళ్లే క్రమంలో నిర్మల్ మీదు నుంచి కాకుండా నిజామాబాద్ జిల్లా గుమ్మిరియాల మీదుగా కిడ్నాపర్లు వాహనాలను తరలించారు. ఆ తర్వాత హైదరాబాద్ రహదా రిపై ఇందల్వాయి, భిక్కనూర్ టోల్ ప్లాజాలను దాటారు. ఆ క్రమంలోనే కిడ్నాపర్లతో హరీష్ మాటామాట కలిపినట్లు చెబుతున్నారు. తనను కిడ్నాప్ చేస్తే ఏమీ రాదని... మీరేం కోరుకుంటున్నారో చెప్పాలని వారిని క్రమంగా ఒప్పించారు. ఇదే క్రమంలో ఆయన తన సన్నిహితులకు ఫోన్లు చేసి డబ్బులు అడగడంతో కిడ్నాపర్లకు నమ్మకం కలిగింది. దీంతో ఆయన కట్లు విప్పినట్టు చెబుతున్నారు.

**తూప్రాన్ టోల్ ప్లాజా వద్దకు వెళ్లగానే...**
ఫాస్ట్ టాగ్‌లో బ్యాలెన్స్ లేక పోవడం హరీష్ కుమార్‌కు కలిసి వచ్చింది. టోల్ ప్లాజా వద్ద కొంతసేపు వాహనం నిలిచిపోగా అదే సమయాన్ని చాన్స్‌గా తీసుకున్న హరీష్ కుమార్ వాహనంలో నుంచి కిందకు దిగి తనను కిడ్నాప్ చేస్తున్నారంటూ గట్టిగా అరవడంతో కిడ్నాపర్లు టోల్ ప్లాజా గేటును బద్దలు కొట్టి హరీష్ వాహనం తీసుకుని పారిపోయారు. ఆయన వెంటనే తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన సమాచారాన్ని వెల్లడించారు. అక్కడి పోలీసులు హరీష్‌ను తీసుకొని నిర్మల్‌కు తీసుకువచ్చారు. తన కిడ్నాప్‌కు సంబంధించిన అన్ని విషయాలను హరీష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన సొంత ఊరికి చెందిన వ్యక్తి ఈ కిడ్నాప్ వ్యవహారంలో కీలక సూత్రధారిగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



**హరీష్ కుమార్‌ను పరామర్శించిన అల్లోల**

**నిర్మల్ :** నిర్మల్ జిల్లా మామడ మండలం పొంగల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత డిసిసిబి డైరెక్టర్ సిహెచ్ హరీష్ కుమార్ కిడ్నాప్ అయి తప్పించుకోగా ఆదివారం మాజీ మంత్రి ఇంద్రకన్ రెడ్డి ఆయనును పరామర్శించారు. ఇంటికి వెళ్లిన ఇంద్రకరణ్ రెడ్డి జరిగిన ఘటనపై అన్ని వివరాలను అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి హరీష్ కుమార్‌ను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.



## అండగా ఉంటా.. అధైర్యపడకండి..!

- పిడుగుపాటుతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం
- బాధితులనుపరామర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
వర్షాకాల సమయంలో పొలాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఇటీవల బేల మండలంలో పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు దుర్మరణం చెందడం బాధాకరమైన విషయమని అన్నారు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ... బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని రకాలుగా సహకారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారు. బాధిత కుటుంబాలకు వ్యక్తిగతంగా సైతం అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇంద్రజిత్, కరుణాకర్ రెడ్డి, మురళీధర్, దత్తానిక్కం, సందీప్, రాము, నవీన్, మూడేశ్వర్, రాకేష్ సూర్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన



**బెజ్జూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
బెజ్జూరు మండలంలోని సలుగుపల్లి గ్రామంలో ఆదివారం బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అకస్మత్తుగా ఎవరైనా కింద పడిపో యిన, గుండె నొప్పితో బాధపడుతున్న వారిని సీపీఆర్ ఎలా చేయాలో వివరించారు. సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాలు నిలబడే అవకాశాలు ఉంటాయిన తెలిపారు. ప్రతి ఒక్కరికి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సీపీఆర్ చేసిన తర్వాత వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకు వెళ్లినట్లయితే ప్రాణాలు నిలదొక్కుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నకిలీ విత్తనాలు, సైబర్‌క్రైం నేరాలపై అవగాహన కల్పిం చారు. నకిలీ పత్తి విత్తనాలు కొనుగొలు చేసి మోస పోవద్దని సూచించారు. అనవసరమైన లింకులు ఓపెన్ చేసి అకౌంట్‌లో డబ్బులు పొగొట్టుకొవద్దని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈ ప్రాంత ప్రజలతో అవినాభావ సంబంధం



**ఓదెల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
ఈ ప్రాంత ప్రజలతో మా కుటుం బానికి అవినాభావ సంబంధం ఉందని గనుల, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ అన్నారు. ఓదెల భ్రమ రాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం అల్లం సతీష్ 101 కొబ్బరికాయలను మొక్కు తీర్చేందుకు మంత్రి వివేక్ ఆలయా నికి వచ్చారు. ప్రజల గుండెల్లో ఉన్న మానాన్న ఎంపీ వెంకటస్వామి స్ఫూర్తిగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మల్లికార్జున స్వామి, రామాలయంలో అర్చనలు చేశారు. నాతో పాటు ఎంపీ వంశీకృష్ణ నిధులతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆలయ ముఖ్య అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఘన స్వాగ తం పలికారు. మంత్రిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు. గుండేటి అయిలయ్య, శ్రీనివాస్, సదానందం, శ్రీధర్, బిక్షపతి, రవీందర్, ఎర్రయ్య, శివ, రాజేశం పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- కగార్ ఆపరేషన్ నిలిపివే సి చర్చలు జరుపాలి...
- నస్పూర్ మహాసభలో చాడ వెంకట్‌రెడ్డి

**నస్పూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సం క్షేమాల పథకాల అమలులో విఫలం చెందాయని భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి ఆరోపించారు. సీపీఐ నస్పూర్ మండల 3వ మహా సభ స్థానిక నర్సయ్య భవన్‌లో ఆదివారం జరిగింది. అంతకు ముందు గోదావరి కాలనీ షిర్కే సెంటర్ నుంచి నస్పూర్ కాలనీ మీదుగా సీసీసీ కార్నర్ సమీపంలోని నర్సయ్య భవన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం నర్సయ్య భవన్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద అమర వీరులకు పూల మాలలు వేసి నివాళులు ఆర్పించారు. అనంతరం జరిగిన మహాసభ సమావేశంలో చాడ వెంకట్ రెడ్డి మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాలను మరిచి పాలన సాగిస్తు న్నాయన్నారు. అలాగే రాష్ట్ర మహాసభలు ఆగస్టు నెలలో మెద్చల్‌లో 22, 23 తేదీల్లో జరుగుతాయన్నారు. జాతీయ మహాసభలు పంజాబ్ రాష్ట్రం చండీ ఘడ్‌లో సెప్టెంబర్‌లో జరుగుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరే షన్‌ను వెంటనే ఆపి వేసి చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కా ర్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్నారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు ఆహ్వాన సంఘం అధ్యక్షులు మేకల దాసు, నస్పూర్ కార్యదర్శి జోగుల మల్లయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి సీతారామయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు రేగుంట చంద్రశేఖర్, వీరభద్రయ్య, రవి, సమ్మయ్య, బాజీసైదా, చంద్రకళ పాల్గొన్నారు.

## మందమర్రి పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా బత్తుల శ్రీనివాస్ ఎన్నిక



**మందమర్రి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
పట్టణం మార్కెట్ ఏరియా పద్మశాలి సంఘం ఎన్నికల్లో బత్తుల శ్రీనివాస్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆదివారం దీపక్ నగర్ పద్మశాలి భవనంలో సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎనినకల ప్రక్రియ జరిగింది. మొత్తంగా 470 ఓట్లు ఉండగా 392 ఓట్లు పోలయ్యాయి. బత్తుల శ్రీనివాస్‌కు 262 ఓట్లు, బత్తుల సతీష్ బాబు 114 ఓట్లు, నాగేందర్‌కు 11 ఓట్ల వచ్చాయి. దీంతో బత్తుల శ్రీనివాస్ విజయం సాధించడంతో పద్మశాలి కుల సభ్యులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు. మరోసారి తనపై నమ్మకంతో అధిక మెజార్టీతో అధ్యక్షుడిగా గెలిపించిన సభ్యులకు రుణపడి ఉంటానన్నారు.



## మల్టీపర్పస్ వర్కర్‌పై దాడి చేసిన
# వారిని కఠినంగా శిక్షించాలి

- వికలాంగుడిపై దాడి చేయడం శోచనీయం..
- దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కొండాపూర్ గ్రామస్తుల డిమాండ్..
- దండేపల్లి సబ్‌స్టేషన్ ముందు రాస్తారోకో
- సీఐ హామీతో ఆందోళన విరమణ..
- న్యాయం చేస్తామన్న హామీతో ఆందోళన విరమణ

**దండేపల్లి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన భారతపు ప్రభాకర్ అనే దివ్యాంగునిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ చేయాలని కోరుతూ కొండపూర్ గ్రామస్తులు పోలీస్ స్టేషన్ సమీపంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రాస్తారోకో చేపట్టారు. వివ రాల్లోకి వెళితే.. కొండాపూర్ గ్రామ పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ ప్రభాకర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన భారతారపు లింగయ్య, కుమారస్వామిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం దండేపల్లి మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. భూ విషయమై గ్రామానికి చెందిన తం డ్రీకొడుకులు లింగయ్య, కుమార స్వామి ఓ మహిళతో గొడవ పడ్డారు. అదే గ్రామానికి చెందిన భారత సత్తవ్వ, కుమారస్వామి కుటుంబాలకు ఇంటి పక్కనే ఉన్న పెరడు విషయంలో గత కొద్ది కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో కుమారస్వామితో పాటు లింగయ్య, అమృత, గంగ లక్ష్మిలు సత్తవ్వపై దాడికి పాల్పడ్డారు. దీంతో పక్కనే ఉన్న సత్తవ్వ మరిది అయిన ప్రభాకర్ గొడవ ఆపేందుకు వెళ్లగా అతనిపై కుమారస్వామి, లింగయ్య, అమృత, గంగలక్ష్మీలు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో ప్రభాకర్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. దాడి చేసిన వారిపై ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకోవడం లేదని, న్యాయం చేయాలంటూ ఆదివారం పోలీస్ స్టేషన్ సమీపంలో బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఐ తహసీనుద్దిన్ ఎంత చెప్పినా వినకపోవడంతో లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి రంగ ప్రవేశం చేసి వారితో మాట్లాడారు. దాడి చేసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ విషయమై సిఐ రమణమూర్తిని వివరణ కోరగా ఫిర్యాదు స్వీకరించామని, పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మెడికల్ రిపోర్ట్ రాకుండా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని, రిపోర్టు రాగానే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరు కూడా మధ్యవర్తులతో పోలీస్ స్టేషన్‌కు రాకూడద ని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి పోలీసులకు తెలిపాలన్నారు. ఇరు వర్గాలను రెచ్చగొట్టినట్లయితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



## గెలుపు, ఓటములు సహజం
### ముగిసిన క్రికెట్ పోటీలు



**తాండూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని మాదారం టౌన్ షిప్ లాల్ బహదూర్ స్టేడియంలో ఎంసీసీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-20 క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి సహకారంతో నిర్వహించిన బహుమతుల ప్రధానంలో నాయకులు మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం పెరుగుతుందని, క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 16 టీమ్‌లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. విన్నర్‌గా నిలిచిన గంపలపల్లి జట్టుకు మొదటి బహుమతి కింద రూ. 10వేలు నగదు, షీల్డు, రన్నర్‌గా నిలిచిన మాదారం జట్టుకు ద్వితీయ బహుమతి కింద రూ. 5 వేలు నగదు, షీల్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరం దామోదర్ రెడ్డి, బయ్య మొగిలి, రఘునాథ్ రెడ్డి, పుట్ట శ్రీనివాస్, తిరుపతి, సతీష్, రాహుల్ పాల్గొన్నారు.

## చోరీ కేసు ఛేదించిన పోలీసులు

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని చౌడేశ్వరీ ఆలయంలో జరిగిన చోరీ కేసును పోలీసులు 24 గంట ల్లో ఛేదించి నట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్, అయాన్, మహారాష్ట్రకు చెందిన రాహుల్ చోరీ కి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఆలయ వాచ్మెన్‌ను కత్తితో బెదిరించి రూ. 3 వేలు వసూలు చేయ డంతో పాటు అమ్మవారి ముక్కుపుడక దొంగిలించార న్నారు. సమీర్‌ను అదుపులోకి తీసుకోగా.. ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు.

# టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను విరమించుకోవాలి

## ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



**కాగజ్‌నగర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

కుమురంభీం టైగర్ కన్జర్వేషన్ రిజర్వు జీవోను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలి సిర్పూర్ శాసన సభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి సంప్రదింపులు లేకుండా ఏక పక్షంగా, ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.49 ను తీసుకువచ్చిందని ఆరోపించారు. జీవో వల్ల జిల్లాలోని రైతులకు, గిరిజనులకు, గిరిజనేతరులకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాల్లోని దాదాపు 4 లక్షల ఎకరాల అటవీ ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటించడంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడి, ప్రజలు తిరగలేని పరిస్థితి దాపురిస్తుందని తెలిపారు. ఇప్పటికే పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ రోడ్లకు కనీసం మరమ్మతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇంకా కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అనుమతులు వచ్చే పరిస్థితి ఉండదని విమర్శించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు వేయలేని పరిస్థితి వచ్చిందని, తాగునీటికి బోరింగ్లు వేయనీయకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని విమర్శించారు. ఇక టైగర్ కన్జర్వేషన్ రిజర్వు పేరిట అటవీ అధికారులు పెట్రేగి పోయి ప్రజల మాన ప్రాణాలతో చెలగాటం ఆడటం జరుగుతుందని ఆరోపించారు. జీవో నంబర్ 49పై ఆదివాసీ సంఘాలు ఆందోళన చేస్తుంటే, కనీసం మాట మాత్రం కూడా గిరిజన ఇన్‌చార్జి మంత్రి సీతక్క మాట మాత్రం స్పందించక పోవడం అన్యాయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ నిలదీసి అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రేపటి నుంచి బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్ కార్యాలయాల ఎదుట జీవో నం.49 ప్రతులను దహనం చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ధోని శ్రీశైలం, పట్టణ అధ్యక్షులు శివ, మాజీ ఎంపీపీ కొప్పుల శంకర్, మండల అధ్యక్షులు పుల్ల అశోక్, మాజీ ఎంపీటీసీ గణపతి, తిరుపతి, గజ్జల లక్ష్మణ్, తిరుపతి గౌడ్, మహేష్, చిలుకయ్య పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

### పిడుగుపాటు మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

గాదిగూడ మండలం పిప్పిరి గ్రామంలో ఇటీవలే పిడుగుపాటుకు గురై మరణించిన కుటుంబాలను ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఆదివారం మృతుల నివాసానికి వెళ్లి మరణించిన వారి చిత్ర పటాలకు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారి దీన గాథను విన్న, చిన్న చిన్న పిల్లలను చూసి ఎమ్మెల్యే కంటతడి పెట్టుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. పంటపొలాల్లో పత్తి విత్తనాలు నాటుతున్న సమయంలో పిడుగులు పడి రైతులు, రైతు కూలీలు నలుగురు మృతి చెందడం, కొందరు గాయపడ టం చాలా బాధాకరం అన్నారు. ఈ ఘటన జరగడంపై తీవ్ర మనస్థాపానికి గురయ్యాయని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తగా



ఉండాలని సూచించారు. మరణించిన రైతుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రే షియా అందించాలని, బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించిన రైతు భీమా, రైతు భరోసా ఇచ్చి కుటుంబంలో ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన నాతరి స్వామి

**బెల్లంపల్లి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి హైదరాబాదులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి పూల బొకే అందజేసి విషెస్ తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కి చెందిన యువ నాయకుడు నాతరి స్వామి నేరుగా హైదరాబాద్ కు వెళ్లి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి జన్మదిన వేడుకలు తెలిపి తన అభిమానాన్ని చాటుకున్నారు.



# గ్రామదేవతలకు జలాభిషేకం

## పొన్కల్‌లో ఘనంగా చలేంద్రి పండుగ

**మామడ, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ ఆదివారం మండలంలోని పొన్కల్ గ్రామంలో చలేంద్రి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు వాయిద్యాలతో గోదావరి నదికి వెళ్లి, గంగమ్మ, నాగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, బిందెలలో గంగాజలాన్ని తీసుకు వచ్చి గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించి, తమకు టుంబాలను చల్లంగా చూడా లని, వర్షాలు సకాలంలో కురిసి, పంటలు బాగా పండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడిసి సభ్యులు, గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు. బోనాలు సమర్పించారు. సంఘం సభ్యు లు, మహిళలు గ్రామంలోని పలు వీధుల గుండా బోనాలతో శోభాయాత్ర నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సోనాల గ్రామంలో శాలివాహన సంఘం వారు, మహిళలు తాతఆయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం



అధ్యక్షుడు మల్లెపూల శివారెడ్డి, సంఘం స భ్యులు, సోనాల గ్రామంలో శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**బెల్లంపల్లి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బెల్లంపల్లి ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని తలపెట్టినట్లు యూనియన్ మంచిర్యాల జిల్లా జేఏసీ అధ్యక్షుడు కట్ట రాంకుమార్ తెలిపారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంటా చౌరస్తాలో సింగరేణి అన్వేషణ విభాగం ప్రహారీని ఆనుకుని ఉన్న స్థలాన్ని ఆటో యూనియన్‌కు కేటాయించాలని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లకు భోజన వసతి, మీటింగ్ హాల్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రస్తుతం ఉన్న ఆటో స్టాండ్ స్థలాన్ని కేటాయిస్తూ అనుమతినివ్వాలని కోరారు. పట్టణంలో ఉన్న పలు ఆటో స్టాండ్ స్థలాలు కబ్జాలకు గుర య్యాయని, భవిష్యత్తులో ఆ స్థలాలు మరింతగా కబ్జా కాకుండా కలెక్టర్ చొరవ చూపాలని పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాల పట్టివేత

**వాంకిడి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
అక్రమంగా తరలిస్తున్న నకిలీ విత్తనాలను ఆదివారం సాయంత్రం వాంకిడి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం ఆర్టీఏ కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మహారాష్ట్ర నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో అనుమానాస్పదంగా కనిపించిన మహా రాష్ట్రకు చెందిన పల్లపు వినోద్ వద్ద తనిఖీ చేయగా 7 కేజీల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. దీని విలువ సుమారు 20 వేలు ఉంటుందన్నారు. అతని అదుపులో తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఈనెల 17 నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ సెట్ కౌన్సెలింగ్



**బెల్లంపల్లి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఈ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 17 నుంచి ప్రారంభం అవుతుందని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. మొదటి దశ కౌన్సెలింగ్ జూన్ 14 నుంచి 18 వరకు విద్యార్థులు అధికారిక వెబ్ సైట్ లో రిజిస్టర్ చేసుకుని తమ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. స్లాట్ బుక్ చేసిన అభ్యర్థులు జూన్ 17 నుంచి 19 వరకు కౌన్సెలింగ్ కేంద్రంలో హాజరై తమ ధ్రువపత్రాల పరిశీలించుకోవాలని సూచించారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం, అభ్యర్థులు తమ కోర్సులు , కాలేజీల ఎంపికను జూన్ 21 లోపు ఫ్రీజ్ చేసుకోవాలని సూచించారు. ఆప్షన్ ఫ్రీజింగ్ పూర్తయిన తరువాత సీటు కేటాయింపు, ఫలితాలు ప్రకటించబడతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు అలాట్ అయిన కళాశాలలో నిర్ణీత తేదీలోగా రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలు ఈసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, 10వ తరగతి మెమో, డిప్లొమా, బీఎస్సీ మార్క్స్ మెమోలు, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆదాయం, నివాస, ఎన్సీసీ, స్పోర్ట్స్, పీహెచ్సీ సంబంధిత ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. వెరిఫికేషన్‌కు అభ్యర్థి వ్యక్తిగతంగా హాజరవ్వాలని, ఫ్రీజ్ చేయని అభ్యర్థులను సీటు కేటాయింపులో పరిగణనలోకి తీసుకోరని స్పష్టం చేశారు. అభ్యర్థులు , తల్లిదండ్రులు అధికారిక వెబ్‌సైట్ https://tgecet.nic.in ను తరచూ తనిఖీ చేయాలని సూచించారు.

## గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన



**తిర్యాణి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని కుమరంభీం చౌరస్తాలో ఆదివారం గ్రామస్థులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడవచ్చున్నారు. 108 వాహనం వచ్చే వరకు సీపీఆర్ చేయడంతో నిండు జీవితాన్ని కాపాడినవారమవుతామని చెప్పారు.. భారీ వర్షాలు కురిసినపుడు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విమాన ప్రమాద మృతులకు నివాళి



**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని ఆదిలాబాద్ వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. విమాన ప్రమాద ఘటనలో ప్రాణాలు విడిచిన వారికి సనాతన హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న కార్గిల్ పార్కులో అమరవీ రుల స్తూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, రవీందర్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

**బెజ్జూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
బెజ్జూరు మండలం పాపన్నపేట గ్రామానికి చెందిన మల్లేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు పరామర్శించారు. ఇటీవల పాపన్నపేట బిజెపి కార్యకర్త మల్లేష్ గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని ఆదివారం ఎమ్మెల్యే పరామర్శించి, ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లేష్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు తిరుపతి, మాజీ సర్పంచ్ వసిఉల్లా ఖాన్, బిజెపి నాయకులు సామల తిరుపతి, జాడి దిగంబర్,రంగన్న శ్యామ్, సుందర్, రమేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులను గౌరవించాలి

**ఆదిలాబద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
వృద్ధులను గౌరవించడంతో పాటు వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వయోవృద్ధుల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిం చారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల కోసం ఉన్న చట్టాల గురించి అది సమైక్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే అవగాహన కల్పించారు. లక్ష్మారెడ్డి, నరసింహులు, పోశెట్టి, హనుమంత్ రెడ్డి, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## జొన్నల డబ్బులు వేయకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం

**బోథ్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
వారం రోజుల్లో జొన్నల డబ్బులు, రైతు భరోసా జమ చేయకపోతే జిల్లా వ్యాప్తంగా మహాధర్నాతో కలెక్టరేట్ ను ముట్టడిస్తామని బోథ్ మండల రైతులు తీర్మానించారు. ఆదివారం నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం రైతు లు ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులు మాట్లాడారు. ఇప్పటికే రైతు భ రోసా సక్రమంగా రాక, జొన్నలను అమ్మి నెలన్నర గడుస్తున్నా ప్రభుత్వం ఇప్ప టికీ డబ్బులు జమ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు అన్నారు. ప్రస్తుతం దుక్కి దున్ని విత్తనాలు వేసే సమయంలో చేతిలో చిల్లి గవ్వలేక అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి దాపురించింది అని వాపోయారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి జొన్నల డబ్బులను రైతుల ఖాతాలో జమ చేయాలి అని అన్నారు. లేనిపక్షంలో మెరుపు ధర్నా నిర్వహిస్తామని రైతులు తెలిపారు.



# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తాం



**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

సీఎం రేవంత్ రెడ్డిపై కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ త్వరలో పోలీస్ స్టేషన్ల ముట్టడికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి జోగు రామన్న పిలుపునిచ్చారు. ఆదివారం సాత్నాల, జైనథ్, బోరజ్, బేలా మండలాల ముఖ్య నాయకులతో బీఆర్ఎస్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రైతులకు రూ.41 వేల కోట్ల రైతు బంధు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం రూ. 22 వేల కోట్లు మాత్రమే ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ రూ.320 కోట్ల విలువగల భూములను కబ్జా చేశాడని కాంగ్రెస్ నాయకులు ఆరోపించినా కూడా స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. భూ కబ్జాలపై ఎస్పీ కేసులు నమోదు చేయడం మంచి పరిణామమైనా ఎమ్మెల్యేపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రైతు సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు సిద్ధంగా ఉండాలని కోరారు.



## విశ్వహిందూ పరిషత్ కార్యదర్శిగా సంతోష్

**ఆసిఫాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

విశ్వ హిందూ పరిషత్ కార్యదర్శిగా ఆకుల సంతోష్‌ను నియమించినట్లు ధనుంజయ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శిశు మందిర్‌లో ఆదివారం నిర్వహించిన విశ్వహిందూ పరిషత్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో హిందూ సమాజంలోని అస్పృశ్యత అంటరానితనం తొలగించి నిమ్న వర్గాలలో చైతన్యం నింపేందుకు సామాజిక సమరసత రథయాత్ర చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా జనగామ (ఆసిఫాబాద్) ప్రఖండ కార్యదర్శిగా ఆకుల సంతోష్, సహకారదర్శిగా మురుముర్ వార్ రాజును నియమించారు. ఈ సమావేశంలో పరిషత్ విభాగ్ కార్యదర్శి అయోధ్య రవీందర్, జిల్లా అధ్యక్షులు రేవల్లి రాజలింగు, జిల్లా ఉపాధ్యక్షురాలు గొట్టిపర్తి కనకతార,జిల్లా కార్యదర్శి వేముల రమేష్, విపిన్ లోధా, రాపర్తి నవీన్, వైభవ్, సింహాద్రి, బజరంగ్‌దళ్ జిల్లా సహ సంయోజక్ మురళీ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మల్ వైద్యురాలికి అవార్డు



**నిర్మల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ దేవ్ భాయ్ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్, సంతాన సాఫల్య నిపుణురాలు డాక్టర్ చంద్రిక కాసావార్‌కు అరుదైన ఘనత దక్కింది. ఆమె అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఓ టీవీఛానల్ యాజమాన్యం రాష్ట్రస్థాయి అవార్డును ఆదివారం అందజేసింది. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ సిటీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన డాక్టర్లకు టీవీ యాజమాన్యం అవార్డులతో సత్కరించింది. డాక్టర్ చంద్రిక కాసావార్ సంతాన సాఫల్య నిపుణురాలిగా ఎంతోమంది పిల్లలు లేని వారికి వైద్యం చేసి సంతానం కలిగేలా చేస్తున్నారు.

## ప్రభుత్వ వైద్యునికి సేవా పురస్కార అవార్డు

**నిర్మల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ వైద్య ఆసుపత్రిలో ఆర్థోపెడిక్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రమోద్ చంద్రరెడ్డికి ఆదివారం ఓ టీవీ ఛానల్ సేవా పురస్కార అవార్డు లభించింది. వైద్య రంగంలో సేవ భావంతో పేద రోగులకు అందిస్తున్న ఉచిత సేవలతో పాటు సామాజిక రంగంలో ఆయన చేసిన కృషిగాను ఈ అవార్డు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్‌లో ప్రమోద్ చంద్రరెడ్డి ఈ అవార్డు స్వీకరించారు.



## కడెం ఎడమ కాలువ సిల్ట్ తొలగింపు



**కడెం, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

కడెం ప్రాజెక్ట్ ఎడమ కాలువ గేట్ల వద్ద పేరుకుపోయిన స్టిల్‌ను తొలగించేలా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగు రోజులుగా పొక్లెయిన్ సహాయంతో స్టిల్‌ను తొలగిస్తూ కాలువ నీరు చివరి ఆయకట్టుకు సక్రమంగా చేరేలా మరమ్మతు పనులు చేస్తున్నట్లు ఈఈ విఠల్ పేర్కొన్నారు. త్వరలోనే స్టిల్ తొలగింపు ప్రక్రియను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## రైలు నుంచి జారి పడి ఇద్దరు మృతి



**తాండూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా రేచిని రోడ్ - బెల్లంపల్లి రైల్వేస్టేషన్ మధ్య ఆదివారం ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు బెల్లంపల్లి రైల్వే పోలీసులు తెలిపారు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు నుండి జారిపడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒకరి వయసు 40-45 సంవత్సరాలు, బక్కపలుచని దేహం, తెల్లని లాల్చీ పైజామా ధరించాడు. ఎడమ చేతి పైన, మెడపై ఎడమ వైపు పచ్చబొట్టులు ఉన్నాయి. నాగపూర్ నుండీ కాచిగూడ వరకు టిక్కెట్ తీసుకున్నాడు. మరొకరి వయసు 25-30 సంవత్సరాలు కాగా బక్కపలుచని దేహం, బెల్లంరంగు ఫుల్ హ్యాండ్స్ వింటర్ స్వెట్టర్, మెరూన్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, గోధుమ రంగు జీన్స్ ప్యాంట్ ధరించాడు. ఎడమ చేతి పైన పచ్చ బొట్టు కలదు. చనిపోయిన ఇద్దరు వ్యక్తులు బహుశా ముస్లింలు అయి ఉంటారని పోలీసు భావిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 8712658596, 9490871784, 9949304574 సంప్రదించాలని జి ఆర్ పి పోలీసులు తెలిపారు.

## మంత్రి సీతక్కను మార్చడం సరికాదు



**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆదివాసీ బిడ్డ, ధనసరి సీతక్కనే యథావిధిగా కొనసాగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ డిమాండ్ చేశారు. మావల మండలం కొమురం భీం కాలనీలో స్థానిక ఆదివాసీలతో ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోడం గణేష్ మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా అంటేనే ఆదివాసీల జిల్లా అని చెప్పే పాలక ప్రభుత్వాలు ఆదివాసీలు ఇప్పుడిప్పుడే రాజకీయంగా, మరీ ముఖ్యంగా ఆది వాసీ మహిళలు ముందుకు వచ్చి రాజకీయంగా తనకు తాను అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఆకాశంలో సగం పోరాటంలో సగం భాగం అంటూ రాజకీయాల్లో తమదైన ముద్ర వేసి, రాష్ట్రంలోనే ఆదివాసీ మహిళలలోనే ధనసరి సీతక్క ఒక్కరన్నారు. అడవితల్లి ముద్దుబిడ్డ ఆదివాసీల ఆశాజ్యోతి సీతక్క జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి మన్నాన్నలను పొందుతూ, ముఖ్యంగా ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలుతో పాటు ఆదివాసి చట్టాలు హక్కులు ఆదివాసీల సమస్యలపై పూర్తిగా అవగాహన ఉండి సమస్యల పరిష్కారం కోసం, అన్ని వర్గాల ప్రజల సమస్యలను ఇప్పుడిప్పుడే కృషి చేస్తున్న మంత్రి సీతక్కని ఇంచార్జీ నుండి మార్చడం ఆదివాసులను అవమానపరచడమే అవుతుందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను ముఖ్యమంత్రి దత్తత తీసుకున్నారు. కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్ర మార్క అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధిని కోరుకునేవారు అయితే మంత్రి సీతక్క విషయంలో పునరా ఆలోచన చేయా లన్నారు. తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసి మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక ఉన్నారు.



## ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

**శ్రీరాంపూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయం వద్ద పోస్టర్లు ఆవిష్కరించారు. పార్టీ కోల్‌బెల్ట్ కార్యదర్శి డి. బ్రహ్మానందం మాట్లాడుతూ, కేంద్ర బలగాలు దండకారణ్య ప్రాంతంలో ఆపరేషన్ కగార్ పేరిట జరుపుతున్న హత్యాకాండను ఆపాలని డిమాండ్ చేశారు. ఇటీవల కర్రె గుట్టలను చుట్టు ముట్టి 31 మంది మందిని ఎన్‌కౌంటర పేరిట కాల్చి చంపడం దారుణమ న్నారు. మావోయిస్టు కార్యదర్శి నంబాల కేశవరావును పట్టుకొని చంపడ మే కాకుండా అతని మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం దు ర్మార్గమన్నారు. చర్చలకు సిద్ధమని మావోయిస్టు పార్టీ పేర్కొంటున్నా, కేంద్ర ప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేయకపోవడాన్ని తాము ఖండిస్తున్నామ న్నారు. ఇప్పటికైనా మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలని డిమాండ్ చేశా రు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవం తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రామయ్య, గద్దె మల్లేష్, పోతుల కిష్టయ్య, భూపతి యాదగిరి, కొదురుపాక సదానందం, పాల్గొన్నారు.

## ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

**తాంసి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని వడ్డాడిలో మత్తడివాగు ప్రాజెక్టు వద్ద ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని ఆదివారం తాంసి పోలీసులు కాపాడారు. తాంసి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కప్పర్ల గ్రామానికి చెందిన ప్రభాకర్ కుటుంబ సమస్యలతో పాటు మానసిక స్థితి సరిగా లేక ఆత్మహత్య చేసుకునేందుకు సాయంత్రం ప్రాజెక్టు వద్దకు వచ్చాడు. తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు డయల్ కాల్ చేయడంతో అప్రమత్తమైన పెట్రోలింగ్ సిబ్బంది వికాస్ అదుపులోకి తీసు కున్నారు. నాలుగు రోజుల క్రితం జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు సైతం మత్తడివాగు ప్రాజెక్టు వద్దకు ఆత్మహత్యకు పాల్పడటానికి రాగా పోలీసులు అడ్డుకున్నారు.



# సింగరేణిలో పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా

- సాధ్యసాధ్యాలపై అధ్యయనం చేస్తున్న ఎంఎన్ఎల్ సంస్థ
- శ్రీరాంపూర్ డివిజన్‌లో విస్తృత పర్యటన
- కార్మిక నివాస గృహాలు, భారీ యంత్రాలకు గ్యాస్ వినియోగంపై సమాలోచన
- ఇది సాధ్యమైతే సంస్థపై తగ్గనున్న ఆర్థిక భారం



**మంచిర్యాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

సింగరేణి యాజమాన్యం ఖర్చులు తగ్గించుకోవడానికి రకరకాల మార్గాలను అన్వేషిస్తోంది. భూగర్భ గనులతో నష్టాలు వస్తున్నప్పటికి, ఓపెన్‌కాస్ట్ గనులతో ఆ నష్టాలను పూడ్చుకుంటున్నది. ఇక సంస్థలో ఇతరాత్ర ఖర్చులు మాత్రం తడిసిమోపెడవుతున్నాయి. ఖర్చులను తగ్గించుకో వడానికి కొత్త కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే చాలా వరకు దుబార ఖర్చులపై ఫోకస్ పెట్టి తగ్గించారు. సింగరేణి సోలార్ ప్లాంట్లు పెట్టి కార్మికుల క్వార్టర్లకు తక్కువ ఖర్చుతో విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా మిగులు విద్యుత్ను ప్రభుత్వానికి అమ్మకాలు చేపడుతూ లాభాలు గడిస్తుంది. మరికొన్నింటిపై ప్రత్యేక దృష్టిసారించి, ఖర్చులు తగ్గించడానికి పలు మార్గాలపై దృష్టిని కేంద్రీకరించారు. ఇందులో భాగంగా సింగరేణి సంస్థలో పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు సన్నాహాలు మొదలు పెట్టారు. అటు భారీ యంత్రాలకు మరియు సింగరేణి కార్మికుల నివాస గృహాలకు పైపులైన్ ద్వారా గ్యాస్ను అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. సింగరేణిలో మొట్టమొదటి సారిగా ప్రయోగాత్మకంగా రామగుండం-1, శ్రీరాంపూర్ ఏరియాలకు సుమారు 16 వేల మంది కార్మికులు, అధికారుల కుటుంబాలకు నాచురల్ గ్యాస్ సరఫరా చేస్తే సింగరేణిపై చాలా వరకు ఆర్థిక భారం తగ్గనుంది. పైప్ లైన్ ద్వారా గ్యాస్ సరఫరా.. సింగరేణి కార్మికులకు యాజమాన్యం ఉచి తంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తుంది. ముందుగా గ్యాస్ సిలిండర్ కొనుగోలు చేసి బిల్లు పెట్టుకుంటే తమ వేతనాల్లో జమ చేస్తుంది. అయితే కేంద్ర ప్రభుత్వం సిలిండర్ ధరలను పెంచుకుంటూ పోతుంది. ఇప్పటికే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర రూ.927 వరకు పెరిగింది. కార్మికులకు సబ్సిడీ అందించడం వల్ల కేంద్రం ధరలు పెంచినప్పుడల్లా సంస్థపై ఆర్థిక భారం పడుతుంది. మరోవైపు సింగరేణి బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషి స్తున్న భారీ యంత్రాలు నడిపేందుకు యాజ మాన్యం కోట్లాది రూపాయలు డీజిల్, పెట్రో లు ఖర్చు చేస్తున్నది. ఓపెన్కాస్టు గనుల్లో బంకులను ఏర్పాటు చేసి వాహనాలకు సర ఫరా చేస్తున్నది. ఇందుకు బదులుగాపర్యావరణ హితమైనా నాచురల్ గ్యాస్ వినియోగంపై అధ్యాయనం చేస్తున్నారు.

**శ్రీరాంపూర్ ఎంఎన్ఎల్ సంస్థ పర్యటన..**

శ్రీరాంపూర్‌లో మహారాష్ట్ర నాచురల్ గ్యాస్ లిమిటెడ్ (ఎంఎన్డీఎల్) సంస్థ ప్రతినిధులు, సింగరేణి అధికారులతో కలిసి ఇటీవల శ్రీరాం పూర్ డివిజన్లో పర్యటించారు. గ్యాస్ వినియోగంపై పరిశీలన కమిటీ డైరెక్టర్ మేజర్ శంకర్ కరాజాగీ ఆధ్వర్యంలో సభ్యులు ఎస్కే సింగ్, సుజిత్ రాయికర్, అమోల్ హట్టి, తది తరులు నస్పూర్ కాలనీలోని సింగరేణి జీటీ హాస్టల్ వెనుకభాగంలో ఉన్న రెండు ఎకరాల ఖాళీ స్థలంతో పాటు పలు ప్రాంతాలను సంద ర్శించారు. ఈ ప్రాంతంలో విస్తృతంగా పర్య టించి గ్యాస్ సరఫరాలకు అనుకూలంగా ఉండే ఏరియాలను పరిశీలించారు. నస్పూర్ కాలనీ కేంద్రంగా సీసీసీ టౌన్ షిప్, షిర్కె, ఆర్ కే-5 కాలనీ, నాగార్జున కాలనీల్లో సింగరేణి కార్మికుల నివాసాలు దాదాపు 4000 వరకు ఉంటాయి. వీటికి పైపులైన్ ద్వారా అందించే గ్యాస్ వినియోగంపై స్థానిక అధికారులతో కలిసి సమాలోచనలు చేశారు. ఓపెన్‌కాస్ట్ గని, జైపూర్ ఎస్టీపీపీలను సంద ర్శించి, గ్యాస్ విని యోగం సాధ్యసాధ్యాలపై సమగ్రంగా అధ్యయనం చేస్తున్నారు. కార్మికుల నివాసాలతో పాటు భారీ యంత్రాలకు పైపులైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయడం సాధ్యమైతే సింగరేణి సంస్థపై ఆర్థిక భారం తగ్గనుంది.

**కుందన్‌పల్లి నుంచి సరఫరాకు ఏర్పాట్లు..**

అధ్యాయన కమిటీ సభ్యులు ఓకే చెబితే తెలం గాణలో మొట్టమొదటి సారిగా సింగరేణి సంస్థలో పైప్ లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ సరఫరా కానుంది. మహారాష్ట్రకు చెందిన మహారాష్ట్ర నాచురల్ గ్యాస్ లిమిటెడ్(ఎంఎన్టీఎల్) సంస్థ కుందనపల్లి కేంద్రంగా అటు గోదావరిఖనికి, ఇటు శ్రీరాంపూర్‌తో పాటు ఎస్టీపీపీకి పైప్ లైన్ ద్వారా గ్యాస్ను సరఫరా చేయనుంది. కుందనపల్లిలోని ఇంధన శాఖ నిల్వ కేంద్రం ఉంది. ఇక్కడి వరకు రైల్వే లైన్ అందుబాటులో ఉండడం.. మహారాష్ట్ర నుంచి గ్యాస్‌ను తీసుకురావడం ఎంఎన్సీఎల్ సంస్థకు కలిసివస్తుంది. కుందనపల్లి నుంచి గోదావరిఖని ప్రాంతం దగ్గరగా ఉంటుంది కాబట్టి ఆర్జీ ఏరియా, శ్రీరాంపూర్ ఏరియాలకు పైప్ లైన్ ద్వారా నాచురల్ గ్యాస్‌ను తీసుకువచ్చి సింగరేణికి అందించడం సులభమవుతుంది.

### గ్యాస్ సరఫరాపై సమగ్ర అధ్యయనం

సింగరేణిలోని ఓసీపీల్లో డీజిల్, పెట్రోల్‌తో భారీ యంత్రాలు నడుస్తున్నాయి. ఇంధనాల విని యోగాన్ని తగ్గించి, పర్యావరణహితం దిశగా యాజమాన్యం ఏర్పాట్లు చేస్తుంది. నాచురల్ గ్యాస్ వాడకంపై కమిటీ లోని బృందం సభ్యులు సమగ్రంగా అధ్యాయనం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు సంస్థకు ఆర్థికంగా మేలు జరుగుతుంది. భారీ యంత్రాలకు ఉపయోగించే డీజిల్, ప్రెట్రోల్‌కు బదులు నాచురల్ గ్యాస్ అందించాలని యాజమాన్యం భావిస్తోంది. ఇందు కోసం గ్యాస్‌కు సంబంధించిన పరికరాలను పెట్టి నాచురల్ గ్యాస్ ద్వారా వాహనాలను నడిపించడానికి కమిటీ సభ్యులు అధ్యాయం చేస్తున్నారు.

**-ఎం. శ్రీనివాస్, శ్రీరాంపూర్ జీఎం**



# సోషల్ మీడియాలో కత్తులతో పోస్టు పెట్టిన ఒకరి అరెస్ట్

విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ప్రభాత సమాచారం తెలుగు దినపత్రికకు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పని చేయుటకు జిల్లాల వారిగా సాఫ్ట్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారిగా ఆర్సీ ఇన్‌చార్జీలు, మండలాల వారిగా విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY

**పరారీలో ఉన్న వ్యక్తిని మహారాష్ట్రలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**

**వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి**

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**



ప్రజలను భయబ్రాంతులకు గురి చేసేలా, పబ్లిక్ స్థలాలలో కత్తులతో, డాగర్లతో ప్రదర్శనలు చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ఒక రిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వన్ టౌన్ బి. సునీల్‌కుమార్, మావల సీఐ కె.స్వామితో కలిసి వెల్లడించారు. పట్టణం కొత్త కుమ్మరివాడకు చెందిన ధన్గట్ సుధీర్ మూడు నెలల క్రితం జిల్లాలోని మావలలో పశువుల వాహనాన్ని ఆపి వాహన యజమానిని చంపుతానని బెదిరించి, డబ్బులు వసూలు చేసిన కేసులో పరారీలో ఉన్నాడు. అలాగే సోషల్ మీడియాలో కత్తులు, డాగర్లతో ప్రజలను భయ భ్రాంతులను గురి చేసేలా శాంతి భద్రతల సమస్యలను తలెత్తెలా ప్రయత్నించినందుకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పబ్లిక్ స్థలాలలో కత్తులతో ప్రదర్శనలు చేసి, పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకుని, ప్రజలను భయభ్రాంతు లకు గురి చేసేలా ఉండే వీడియోలను సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో పశువుల వాహనం వద్ద డబ్బుల దౌర్జన్యం చేసిన కేసు, సోషల్ మీడియాలో కత్తులతో ప్రజలను భయభ్రాం తులకు గురి చేసేలా ఉన్న కేసు, స్థానిక ఎగ్జిబిషన్ యజమాని వద్ద డబ్బులను దౌర్జ న్యంతో అడిగిన కేసు, పట్టణంలో మొత్తం తొమ్మిది కేసులో నమోదు అయిందని తెలి పారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇతడిని గడ్చిరోలి జిల్లా ఐరితాం డకు సంబంధించిన ఆళ్లపల్లి అనే గ్రామంలో పట్టుకుని, రిమాండ్కు తరలించామన్నారు. ఇతని వద్ద నుంచి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన కత్తిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

**కుమ్రంభీం ఆసిఫాబాద్**

# జిల్లా వాసికి జ్యూరీ అవార్డు

**ఆసిఫాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఆసిఫాబాద్ మండలం జెండాగూడ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు మసాదే లక్ష్మీనారాయణను తెలంగాణ గద్దర్ ఫిల్మ్ జ్యూరీ అవార్డు వరించింది. హైదరాబాద్‌లోని హైటెక్స్ రాత్రి జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటో గ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా జ్యూరీ అవార్డు అందుకున్నారు. మసాదె బాపు, లక్ష్మి దంపతుల పెద్దకు మారుడు లక్ష్మీనారాయణ 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో జర్నలిస్టుగా పనిచేస్తున్నారు. విలేకరిగా కెరీర్ ప్రారంభించి పలు దినపత్రికల్లో సేవలందించారు. ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్‌కు ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ ఫిల్మ్ జర్నలిస్టు అసోసియేషన్‌కు వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారు. హైదరాబాద్‌లోని జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రారంభించిన ది జర్నలిస్టు కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీకి ప్రస్తుతం ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'దిల్' రాజు, 2024 జ్యూరీ చైర్మన్ జయసుధకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని చౌడేశ్వరి మాతా ఆలయంలో చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణకర్‌రావు తెలిపారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్ వారం రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా జైలు నుంచి విడుదలై వచ్చాడు. గంజాయికి బానిసైన ఆయన శనివారం అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో క్రాంతినగర్కు చెం దిన షేక్ అయ్యాన్, మహారాష్ట్రకు చెందిన రాహుల్ తో కలిసి చౌడేశ్వరి మాతా ఆలయంలో చోరీకి పాల ్పడ్డాడు. వాచ్మెన్ గంగయ్యను కత్తితో బెదిరించి రూ.3వేల నగదు, బీరువాలో ఉన్న ముక్కుపుడకను దొంగిలించి పరారయ్యారు. ఆదివారం వడ్డెర కాలనీలో చోరీకి ప్రయత్నించాడు. రైల్వే స్టేషన్లో అను మానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు పట్టు కొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి గంజాయి సేవించే పరికరం, రూ.వెయ్యి నగదుతో పాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.





## బాసర ఆర్జీయూకేటీ
# అధ్యాపకుడికి డాక్టరేట్

**ముథోల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఆర్జీయూకేటీ ఎలక్ట్రానిక్స్ అండ్ మ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగధిపతి అసి స్టెంట్ ప్రొఫెసర్ బత్తిన ఉపేంద్రరావుకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. 'ఇన్వెస్టిగేషన్స్ ఆన్ అప్లికేషన్స్ ఆఫ్ డిఫెక్టెడ్ గ్రౌండ్ స్ట్రక్చర్ ఆన్ మైక్రో స్ట్రిప్ పాడ్ ఆంటెన్నా' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఇచ్చింది. ఉపేంద్రరావును ఇన్చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, అధ్యాపకులు ఆదివారం అభినందించారు. ఈ పరిశోధన ద్వారా వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థల్లో హై డేటా రేట్ స్పీడ్ సాధ్యం కావచ్చని వెల్లడించారు.

# 'పరిహారం ఇస్తేనే వెళతాం'

**కడెం, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఆటవీశాఖ అధికారులు తమకు ఇస్తామన్నా పునరావాస పరిహారం ఇచ్చేదాకా పాత ఊళ్ల నుంచి కదలబోమని రాంపూర్, మైసంపేట్ వాసులు పట్టుబట్టారు. ఈనెల 9న పాత ఊరికి వెళ్లిన గిరిజనులు అక్కడే గుడిసెలు వేసుకుని మకాం వేశారు. సాగు భూములకు పట్టాలు, ప్యాకేజీలో అందాల్సిన నగదు, తదితర సమస్యలు పరిష్కరిస్తేనే ఇక్కడ నుంచి కదులుతామని తెలిపారు. లేనిపక్షంలో ఇక్కడే సాగు పనులు చేపడతామని హెచ్చరించారు.పరిహారం ఇచ్చే వరకు కదలమన్నారు.

# అడెల్లి ఆలయానికి భక్తుల తాకిడి



**సారంగాపూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

మండలంలోని అడెల్లి మహాపోచమ్మ ఆలయానికి ఆదివారం మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మ వారికి పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకు న్నారు. ఆలయ ఈవో రమేశ్, చైర్మన్ భోజాగౌడ్ భక్తులకు ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎస్సై శ్రీకాంత్ బందోబస్తు నిర్వహించారు.

# గజ్జలమ్మదేవికి పూజలు

**కుంటాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

గజ్జలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మీ అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, హారతి, అర్చన, పల్లకీసేవ నిర్వహించగా అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బోనాలను నైవేద్యంగా సమర్పించారు. మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.



# ఉత్తమ వైద్యుడిగా అవార్డు అందుకున్న జాదవ్




**ముథోల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ ఉత్తమ డాక్టర్ అవార్డుకు ఎంపికయ్యారు. వైద్యరంగంలో విశిష్టమైన సేవలు అందించినందుకు ప్రైవేట్ టీవీ చానెల్ వారు అవార్డుకు డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్‌ను ఎంపిక చేశారు. దీంతో హైదరాబాదులో ఆదివారం జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్ కు ఘనంగా సన్మానించి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ జాదవ్‌ను ముథోల్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది , జి డి ఆర్ మెమోరియల్ కృష్ణ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బైంసా వైద్యులు డాక్టర్ ఏ దామోదర్ రెడ్డి, డాక్టర్ దీప జాదవ్, డాక్టర్ సుమల రెడ్డి, డాక్టర్ ప్రీతం ,డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సూర్యకాంత్ రెడ్డి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ రచన, సిబ్బంది, బైంసా ఆరె మరాఠా సంఘం గౌరవ అధ్యక్షులు, జాధవ్ పుండలిక్ రావు పాటిల్, అధ్యక్షులు రఘువీర్ పాటిల్, సభ్యులు అభినందించారు.

# సహాయ కమాండెంట్‌గా జిల్లా యువకుడి ఎంపిక

**దండేపల్లి, జూన్ 15 (ప్రభాత సమాచారం)**



కేంద్ర రక్షణ శాఖలో ఉద్యోగం సాధించాలనే తపనతో మూడేళ్లుగా సాధన చేసి సీఏపీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాడు దండేపల్లి మండలం నెల్కి వెంకటాపూర్కు చెందిన పెట్టెం అభినవవర్మ. యూపీఎస్సీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఇటీవల నిర్వహించిన సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ అసిస్టెంట్ కమాండెంట్ (సీఏపీఎఫ్ఏసీ) పరీక్షలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు పెట్టెం లచ్చున్న-సునీత దంపతుల కుమారుడు అభినవవర్మ. 2024 జనవరిలో సీ ఏపీఎఫ్ అసి స్టెంట్ కమాండెంట్ పరీక్షకు నోటిఫికేషన్ ఆగస్టులో జాతీయ స్థాయిలో పరీక్ష నిర్వహించారు. 515 పోస్టులు ఉండగా అభినవవర్మకు 138వ ర్యాంకు సాధించాడు. ఈయన మంచిర్యాలలో పదో తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్, భువనేశ్వర్‌లో డిగ్రీ, జోథ్‌పూర్ ఐఐటీలో ఎంఎస్సీ (గణితం) చదివారు. అభినవ్ వర్మకు మొదటి నుంచి కేంద్ర సర్వీసు ఉద్యోగం చేయాలనే ఆసక్తి ఉండేది. ఐఐటీ చేస్తున్న సమయంలో వివిధ ఉద్యోగాల గురించి పడుతున్న నోటిఫికేషన్లను తెలుసుకునేవాడు. ఈ క్రమంలో యూపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ నోటిఫికేషన్ వెలువడింది. దీనిద్వారా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ శాఖల అధికారులను ఎంపిక చేస్తారు. దీనికోసం 2022 నుంచి నాలుగు సార్లు పరీక్ష రాసినా విజయం దక్కలేదు. ఇంతలోనే 2023 జనవరిలో సీఏపీఎఫ్ఏసీ నోటిఫికేషన్ రావడంతో ఆగస్టులో పరీక్ష రాయగా ఉత్తీర్ణత సాధించలేదు. తిరిగి 2024లో మరోసారి నోటిఫికేషన్ రావడంతో సాధన చేసి చదవడంతో విజయం సాధించి అసిస్టెంట్ కమాండెంట్గా ఎంపికయ్యాడు. ఉద్యోగ సాధనలో మూడు దశలు ఉంటాయని రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఆ తర్వాత భౌతిక పరీక్ష, మౌఖిక ఉంటాయని తాను మూడు దశల్లో విజయం సాధించడంతో ర్యాంకు ప్రకటించారని అభినవ్ వర్మ తెలిపారు. ఇందులో జనరల్ స్టడీస్, సైన్స్, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, గణితం, రీజనింగ్, కరెంట్ ఎఫైర్స్ తదితర అంశాలుంటాయని వివరించారు.

# రైతులకు ఉచితంగా విత్తనాల పంపిణీ

**జైనూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలంలోని ఉషెగావ్ గ్రామంలో సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివాసీ మహిళా రైతులకు ఉచితంగా పెసర్లు,కందులు మరియు మినుములు విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ సంస్థ మండల ఎఫ్.ఇ.డబ్లు హన్వతే డిగాంబర్ మాట్లాడుతూ ఆదివాసీ మహిళా రైతులు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని రైతులందరూ సేంద్రియ వ్యవసాయం చేయుటకు మొగ్గుచూపాలిలని కోరారు తక్కువ పెట్టుబడి తో ఎక్కువ లాభాలను పొందాలని అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక గ్రామ పటేల్ పెందుర్ అమృత్ రావు, రైతు సూర్యభాన్,భీం బాయి,పారు బాయి,రుక్మా బాయి,నిరాజ బాయి,సంస్థ వాలంటీర్లు దివ్య జ్యోతి, మెస్రం రాజేరాం, నాగేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.





## కేంద్ర పథకాలను
# ప్రజల్లోకి తీసుకెళ్లాలి
### ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

దేశం కోసం అహర్నిశలు కష్టపడిన ప్రధాని మోదీ పాలనకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ పేర్కొ న్నారు. ఆదివారం కుంటాలలోని యాదవ సంఘ భవనంలో మోదీ పాలన 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యశాల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదానంతోపాటు యోగ దివాస్, ఎమర్జెన్సీ దివాస్ అంశాల గురించి కార్యకర్తలకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అహ్మదాబాద్‌లో విమాన ప్రమా దంలో మృతి చెందిన వారికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండల కన్వీనర్ పసుల నవీన్, మాజీ ఎంపీపీలు గజ్జారాం, అరుణ, మండల కన్వీనర్లు దత్తాద్రి, రావుల రాము, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ కుమార్, వెంగల్‌రావు గజేందర్, రవి ఉన్నారు.

**మైసమ్మ ఆలయాభివృద్ధికి కృషి....**

పట్టణంలోని కిసాన్‌గల్లి గట్టు మైసమ్మ ఆలయ అభివృద్ధికి దశలవారీగా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. ఆదివారం ఆలయంలో రూ.5లక్షలతో చేపట్టే మెట్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయానికి భక్తులు వచ్చే రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మెట్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు. గోవర్ధన్, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

# నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

**కుంటాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్ర యించాలని డీఏవో అంజిప్రసాద్ సూచించారు. ఆదివారం మండలంలోని కల్లూరులో ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. ఏవో విక్రమ్, ఏఈవో గణేశ్ తదితరులున్నారు.






# ఫస్ట్ హాఫ్‌తో తలైవా ఫుల్ ఖుషీ

సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. అన్ని పనులు పూర్తి చేసుకుని ఆగస్ట్ 14న రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక సినిమాపై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో చెప్పాల్సిన పనిలేదు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది.ఇందులో రజనీ కాంత్ స్మగ్లర్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన లుక్ సహా ప్రచార చిత్రాలన్నీ మంచి బజ్ ని తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ట్రైలర్ ఎప్పుడు రిలీజ్ అవుతుందా? అని అంతా ఆసక్తికరంగా ఎదురు చూస్తున్నారు. అయితే అంతకన్నా గుడ్ న్యూస్ ఒకటి బయటకు వచ్చింది. ఈ సినిమా ప్రథమార్ధం రజనీకాంత్ చూసి సర్ ప్రైజ్ అయ్యారుట. ఔట్ పుట్ చూసి రజనీ చాలా సంతోషంగా ఉందని ఫీడ్ బ్యాక్ ఇచ్చారుట.ద్వితియార్ధం ఇంకా రెడీ కాకపోవడంతో పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. సెకెండాఫ్ కూడా చూసి రజనీకాంత్ రివ్యూ ఇస్తే సంగతేంటి? అన్నది తేలిపోతుంది. ఈ చిత్రాన్ని లోకేష్ కనగరాజ్ భారీ కాన్వాస్ పై రూపొందించారు. అమీర్ ఖాన్, నాగార్జున, ఉపేంద్ర లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వాళ్ల మధ్యలో రజనీకాంత్ వస్తే ఇంకెలా ఉంటుందో ఊహకే అందదు.

# 'మార్కో 2' క్యాన్సిల్!



మలయాళ స్టార్ ఉన్ని ముకుందన్ హీరోగా ఇటీవలే విడుదలైన 'మార్కో' సూపర్ హిట్ విజయాన్నిఅందుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని హింసాత్మక సన్నివేశాలపై తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ.. బాక్స్ ఆఫీస్ వద్ద వంద కోట్లకు పైగా వసూళ్లతో అదరగొట్టింది. దీంతో ఈ సినిమా సీక్వెల్ కూడా ఉంటే బాగుంటుందని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అభిమానులు.ఈ క్రమంలో తాజాగా ఉన్నిముకుందన్ చేసిన పోస్ట్ అభిమానులను నిరాశకు గురిచేసింది. అయితే ఒక అభిమాని సోషల్ మీడియాలో "మార్కో 2 ఎప్పుడు వస్తుంది?" అని అడగగా.. దానికి ఉన్నిముకుందన్ షాకింగ్ సమాధానం చెప్పారు. "క్షమించండి, మార్కో సీక్వెల్ తీసే ఆలోచనను విరమించుకున్నాను. ఈ ప్రాజెక్ట్ చుట్టూ చాలా నెగెటివిటీ ఉంది. మార్కో కంటే పెద్దది, మెరుగైన సినిమాను మీ ముందుకు తీసుకురావడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను. మీ ప్రేమకు, సానుకూలతకు ధన్యవాదాలు" అంటూ బదులిచ్చారు. అయితే 'మార్కో' సినిమా విడుదలైన తర్వాత, అందులోని తీవ్రమైన హింసాత్మక సన్నివేశాలపై విమర్శలు వెలువెత్తాయి. సెన్సార్ బోర్డు కూడా ఈ చిత్రాన్ని టీవీలో ప్రసారం చేయకుండా నిషేధించింది. దీంతో వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఉన్నిముకుందన్ సీక్వెల్ ఆలోచనను విరమించుకున్నట్లు సినీ వర్గాల్లో టాక్.

# బయోపిక్‌లో శ్రద్ధ?



'స్త్రీ' సినిమాలతో సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్. ఈ హారర్ చిత్రాల్లో ప్రేక్షకుల్ని పరుగులు పెట్టించిన ఈ భామకు ప్రస్తుతం అవకాశాలు వరుస కడుతున్నాయి. ఇందులో భాగంగానే 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్టు గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో సందడి చేస్తోంది. జానపద ప్రపంచంలో తనదైన ముద్రవేసిన మహారాష్ట్ర గాయని, నృత్యకారిణి విఠాబాయి నారాయణ్ గావ్‌కర్ జీవితం ఆధారంగా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు సమాచారం. "ఈ బయోపిక్ కేవలం ఒక నర్తకి గురించి మాత్రమే కాదు.. ఈ పురుషాధిక్య ప్రపంచంలో సరిహద్దులను చెరిపేసి రాబోయే తరాలకు జానపద కళల గురించి తెలియజేసిన ఒక గొప్ప మహిళ గురించి" అని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# వాటి మీదే ఆశలు పెట్టుకున్న బ్యూటీ..!

మలయాళ భామ సంయుక్త మీనన్ తెలుగులో భీమ్లా నాయక్ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమాలో ఆమెకు ఇచ్చిన పాత్రలో ఇంప్రెస్ చేసింది అమ్మడు. ఆ తర్వాత విరూపాక్ష, సార్ సినిమాలతో మెప్పించింది. తెలుగులో వచ్చిన పాపులారిటీతో తమిళ్ లో కూడా వరుస ఛాన్స్‌లు అందుకుంటుంది సంయుక్త. ప్రస్తుతం అమ్మడు తెలుగులో స్వయంభు, నారి నారి నడుమ మురారి సినిమాల్లో నటిస్తుంది. నిఖిల్ స్వయంభు సినిమా పీరియాడికల్ కథతో వస్తుంది. ఆ సినిమా కోసం సంయుక్త కూడా గుర్రపు స్వారి నేర్చుకుని మరీ యాక్షన్ సీన్స్ చేసిందని టాక్.ఇక ఈ సినిమాతో పాటు శర్వానంద్ తో నారి నారి నడుమ మురారి సినిమా చేస్తుంది సంయుక్త మీనన్. ఆ సినిమా యూత్ ఫుల్ ఎంటర్టైనర్ గా రాబోతుంది. ఈమధ్యనే నారి నారి నడుమ మురారి సినిమా నుంచి వచ్చిన సాంగ్ ఒకటి ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ రెండు సినిమాలే కాదు అమ్మడు బాలకృష్ణ అఖండ 2 లో కూడా స్క్రీన్ షేర్ చేసుకుంటుంది. అఖండ లో ప్రగ్యా నటించగా అఖండ 2 లో సంయుక్త ఛాన్స్ అందుకుంది.బాలయ్య తో ఛాన్స్ తప్పకుండా అమ్మడి కెరీర్ కి హెల్ప్ అవుతుందని చెప్పొచ్చు. ఐతే అఖండ 2 లో సంయుక్త రోల్ ఏంటన్నది ఇంకా క్లారిటీ రాలేదు. ఐతే సంయుక్త తెలుగులో ఎందుకో వెనకబడింది. రాబోతున్న రెండు సినిమాల మీదే సంయుక్త తన ఆశలన్నీ పెట్టుకుంది. ఈ సినిమాల ఫలితాల మీదే ఈ హీరోయిన్ నెక్స్ట్ సినిమాల అవకాశాలు ఉంటాయి. మరి ఈ రెండిటితో సంయుక్త తిరిగి హిట్ ట్రాక్ లోకి వస్తుందా లేదా అన్నది చూడాలి.

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. జులైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. తాజాగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ నేతలతో సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీ అవుతుందని చెప్పారు. ఇందుకు 15 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ఏవైనా విభేదాలుంటే వాటిని పక్కనపెట్టి పార్టీ విజయం కోసం కలిసి పనిచేయాలని నాయకులకు సూచించారు.

- నెలాఖరుకు నోటిఫికేషన్ ■ ఎన్నికల నిర్వహణకు సర్కార్ కసరత్తు
- ఈ నెలాఖరులో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్
- తర్వాత సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించే యోచన
- త్వరలో జరిగే మంత్రివర్గ భేటీలో స్పష్టత వచ్చే అవకాశం
- ఎన్నికలకు ముందే రైతు భరోసా నిధులు
- మంత్రి పొంగులేటి కీలక వ్యాఖ్యలు ■ గెలిచి తీరాలని శ్రేణులకు పిలుపు
- ఈ వారంలోనే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు
- వీలున్నంత త్వరగా సన్న ధాన్యానికి బోనస్
- తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చేందుకు సర్కారు సిద్ధం!
- రిజర్వేషన్ల పెంపు లేకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు
- కాంగ్రెస్‌లో మొదలైన హడావుడి

# వచ్చే నెలలో స్థానిక ఎన్నికలు




**(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతుంది. జులైలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయిం చినట్లు సమాచారం. తాజాగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో పాలేరు నియోజకవర్గం కాంగ్రెస్ నేతలతో సమావేశంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ నెలాఖరులోగా నోటిఫికేషన్ జారీ అవుతుం దని చెప్పారు. ఇందుకు 15 రోజుల సమయం మాత్రమే ఉన్నందున ఏవైనా విభేదాలుంటే వాటిని పక్కనపెట్టి పార్టీ విజయం కోసం కలిసి పనిచేయాలని నాయకులకు సూచించారు. కేబినెట్ సమావేశం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల తేదీలపై మరింత స్పష్టత వస్తుంద న్నారు. ఎన్నికలు దశలవారీగా జరుగుతా యని, తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయని, ఆ తరువాత పంచాయతీ ఎన్నిక లు జరుగుతాయని చెప్పారు. నాయకుల మధ్య సరైన సమన్వయం ఉండాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు, గెలుపు అవకాశాల ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఇక ఇటీవల మంత్రి సీతక్క కూడా మహబూబాబాద్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వె లువడుతుందన్నారు. మరోవైపు ప్రభుత్వం త్వర లోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లనున్నట్టుగా సంకేతాలిస్తోంది. ఈ క్రమంలోనే మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచనలు చేసినట్టుగా తెలు స్తోంది. రానున్న కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలు, రైతు భరోసా నిధుల విడు దలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. రాష్ట్రంలో గ్రామ పంచాయితీల పదవీకా లం గతేడాది జనవరి 31తో ముగిసింది. జిల్లా పరిషత్ల పదవీకాలం గత సంవత్సరం జులైలో ముగిసింది. దీంతో స్పెషల్ ఆఫీసర్ల పాలన సాగుతుంది. అయితే స్థానిక సంస్థ ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి నిధులు అందడం లేదు. ప్రజలతో నేరుగా ఎన్నికైన స్థానిక సంస్థల పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్రం నిధులను నిలిపివేసింది. దీంతో స్థానిక సంస్థల పరిధిలో అభివృద్ధి పనులకు నిధులు లేకుండా పోతున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్నికల నిర్వహించాలని భావిస్తోంది.

**రైతులకు ఏరువాక శుభాకాంక్షలు..**

'అమితంగా ప్రేమించే పాలేరు నియోజకవర్గ రైతన్నలు ఏర్పాటు చేసుకున్న ఏరువాక కార్యక్రమంలో పాలుపంచుకున్నాను. ఆరుగాలం కష్టపడి దేశ ప్రజలకు ఆహార భద్రత కల్పించే రైతులకు ఏరువాక శుభాకాంక్షలు. ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్న తర్వాత రాష్ట్రంలో అన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. రైతును రాజు చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయిన ఈనాడు మా ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం ఇస్తోంది. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేస్తోంది. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇబ్బంది లేకుండా అందిస్తున్నాం. గత కేసీఆర్ ప్రభుత్వం వారి స్వార్థం కోసం మొదలుపెట్టిన సీతారామ ప్రాజెక్ట్‌ను వదిలేస్తే, వాటిని పూర్తి చేస్తూ సాగునీరు ఇబ్బందులు లేకుండా ఒక్క ఎకరానికి ఇబ్బంది లేకుండా నీటిని అందిస్తున్నాం. ఆ భగవంతుడి దయతో ఈ సంవత్సరం పదిహేను రోజుల ముందే నైరుతి రుతుపవనాలు పలకరించాయి. వ్యవసాయ సీజన్ కూడా మొదలైంది' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**రేపటి నుంచి రైతు భరోసా..**

'ఆనాటి ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు రైతు బంధు ఇస్తే జూన్ 16 నుంచి వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి పెట్టుబడి కోసం రూ. 12 వేలు మా ప్రభుత్వంలో ఇస్తాం. రాష్ట్ర ప్రజల తరపున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. ఆనాటి ప్రభుత్వం రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేస్తే, ఇందిరమ్మ ప్రభుత్వం రూ. 21 వేల కోట్లు రుణమాఫీ చేసింది. రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చాం. రేపటి నుంచి మూడోసారి ఇస్తాం. వరి వేస్తే ఉరే అని గత కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెట్టింది. పేదల, రైతు పక్షపాత ప్రభుత్వంగా ఇందిరమ్మ ప్రభుత్వం పనిచేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన కాళేశ్వరం కూలిపోయింది. అయినా దేశంలో ధాన్యం పండించిన రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. ఉచిత కరెంట్, రైతు భరోసా ,నాణ్యమైన విత్తనాలు అందిస్తున్నాం. ప్రతి నీటిబొట్టును ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది. రాష్ట్రంలో రైతులు అందరూ సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడు ఆశీర్వదించాలి' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరుకున్నారు.

## తామర పూవ్వు కోసం వెళ్లి.. అనంతలోకాలకు..

**ముథోల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**



బాసరలో తామర పువ్వుల కోసం చెరువులోకి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మృతి చెందాడు. ఆదివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..బాసరకు చెందిన బలగం రాజు (38) మైలాపూర్ చెరువులో తామర, కమలం పువ్వులు తేయడానికి వెళ్లగా అపస్మారకంగా నీటిలోకి జారిపడ్డాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు, మృతుడి భార్య సైతం అనారోగ్యంతో మరణించినట్లు సమాచారం.

## కేంద్రం మావోలతో శాంతి చర్చలు జరపాలి




**ఆదిలాబాద్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టు లను, అమాయక ఆదివాసీలను హతమారుస్తున్న కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దామనకాండను నిలిపివేసి, శాంతి చర్చలు జరపాలని సీపీఐ పార్టీ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ము డుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఆప్ రేషన్ కగార్ నిలిపివేయాలని ఇందిరా పార్కు వద్ద ఈనెల 17 తేదీన చేప ట్టే మహా ధర్నాను జయప్రదం చేయాలని పోస్టర్లను రిలీజ్ చేశారు. ఈ సం దర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరిట జనవరి 2024 నుండి మావోయిస్టులను అణచివేసే పేరిట ప్రారంభించిన యు ద్ధం ఆదివాసులతో పాటు మావోయిస్టులపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం మార ణకాండ పట్టిందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న ఆదివాసులు హక్కుల్ని అణిచివేయడం జరుగు తుందని, అక్కడి ప్రకృతి వనంలో ఖనిజ సంపద స్వదేశీ విదేశీ కార్పొరేట్‌లకు ధరదత్తం చేయడం కోసమే ఈ ఎన్‌కౌంటర్లను చేపడుతుందని ఆరోపించారు. అనేక మంది మావోయిస్టులను, జాతీయ కమిటీ సభ్యు డు నంబాల కేశవరావు, అలాగే మైలాపురం ఆడేల్లు అలియాస్ భాస్కర్ అనేక మందిని పొట్ట పెట్టుకుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు నళిని రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, పట్టణ కార్యదర్శి,అరుణ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు పాల్గొన్నారు.

# కన్నీటి గోదారై..





అమ్మా వెళ్లొస్తానన్నావు.. లే నాన్నా ఇంటికెళ్లిపోదాం.. నిర్జీవంగా పడి ఉన్న కొడుకును పట్టుకుని ఒక తల్లి పిలుస్తూనే ఉంది.. నాన్నా ఊరెళ్లొస్తానన్నావు.. ఎప్పుడొస్తావురా.. నీ కోసం నిన్న రాత్రి నుంచి చూస్తూనే ఉన్నా.. రారా వెళ్లిపోదాం! ఇదీ ఒక తండ్రి వేదన.. అన్నయ్యా.. ఇక నాకు దిక్కెవరు.. నువ్వు లేకుండా నేనుండలేను.. అమ్మా నాన్నా లేరు.. నేను నీ దగ్గరికే వచ్చేస్తా.. ఇదీ ఒక చెల్లి వేదన.. ఎటు చూసినా ఆర్తనాదాలే.. పిల్లల కోసం ఎదురుచూపులే.. క్షేమంగా బయట పడాలని మొక్కుబడులే.. ఇవేమీ ఫలించలేదు.. గల్లంతైన ఐదుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. తమ ఆశలు సమాధి చేసిన బిడ్డలను గుండెలకు హత్తుకుని.. దేవుడా ఇక మాకు దిక్కెవరు.. మేం ఎందుకు బతకాలంటూ రోదించారు.. వారిని ఆపడం ఎవరితరం కాలేదు.. ఒక్కసారిగా కన్నీరు.. గోదారైంది..!



- బాసర గోదావరిలో ఐదుగురు జలసమాధి
- దర్శనానికి వచ్చి.. బాసరలో నదీస్నానం చేస్తుండగా ప్రమాదం
- మృతుల్లో ముగ్గురు సొంత అన్నదమ్ములు
- శోకసముద్రంలో కుటుంబ సభ్యులు
- మృతులు హైదరాబాద్ చింతల్, దిల్‌సుక్‌నగర్ ప్రాంతవాసులుగా గుర్తింపు
- ఇసుకగుంతే ప్రమాదానికి కారణం!
- భైంసా ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం

**ముథోల్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాసర గోదావరి వద్ద ఆదివారం ఉదయం తీవ్ర విషాదం నెలకొన్నది. బాసర గోదావరి వద్ద స్నానాలు ఆచరిస్తుండగా ఐదుగురు యువకులు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మలక్‌పేట్, కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌కు చెందిన రాజస్థానీలు దాదాపు 18 మంది కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఉదయం రైలులో బాసరకు వచ్చారు.

పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి వద్ద గల పుష్కర ఘాట్‌కు వెళ్లారు. బోటులో గోదావరి మధ్యలో తేలిన ఇసుక మేట దగ్గరికి వెళ్లి అక్కడే స్నానాలు ఆచరిస్తుండగా కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌కు చెందిన రాకేశ్ (20), మదన్ (18), భరత్ (16), మలక్‌పేట్ డివిజన్‌లోని శాలివాహననగర్‌కు చెందిన కిరాణావ్యాపారి ప్రవీణ్ తమ్ముడు రితిక్ (22), అతని సమీప బంధువు వినోద్ (19) ప్రమాదవశాత్తు నీట మునిగారు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు కేకలు వేయగా.. బోటు నడిపే ఈతగాళ్లు వారిని కాపాడేందుకు ప్రయత్నించారు.

బయటకు తీసి హుటాహుటిన అంబులెన్సులో భైంసా ఏరియా దవాఖానకు తరలించారు. వైద్యులు వారికి ముందుగా సీపీఆర్ చేసినా స్పందించక పోవడంతో ఐదుగురు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్, సీఐ మల్లేశ్ దవాఖానకు చేరుకుని ఘటనకు గల కారణాలను వారి బంధువులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్పీ తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాలను అందజేశారు.

**ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు..**

గోదావరిలో మునిగి చనిపోయిన ఐదుగురు యువకుల్లో రాకేశ్, మదన్, భరత్ సొంత అన్నదమ్ములు. వినోద్ సమీప బంధువు కాగా మలక్‌పేట్‌కు చెందిన రితిక్ వీరి మిత్రుడు. ముగ్గురు అన్నదమ్ములు ఒకేసారి ఇలా ప్రమాదంలో మరణించడంతో తల్లి కన్నీరుమున్నీరైంది.

**ప్రమాదానికి కారణమేంటి?**

బాసర క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి వెళ్తారు. గోదావరిలో తక్కువగా ఉండటంతో మధ్యలో ఇసుక మేటలు తేలాయి. సాధారణంగా భక్తులు పుష్కర ఘాట్ వద్దే స్నానాలు ఆచరిస్తారు. నీటి మట్టం తక్కువగా ఉండటంతో కొందరు భక్తులు ఇసుక తేలిన ప్రాంతానికి వెళ్లి స్నానాలు చేస్తుంటారు. ఇసుక తేలిన ప్రాంతం చుట్టుపక్కల కొంత మేర లోతట్టు ప్రాంతం ఉంటుంది. ఈత సరదాతో లోపలికి వెళ్లి స్నానం ఆచరిస్తూ ప్రమాదవశాత్తు మునిగి పోతున్నారు. బోటు యజమానులు వారిని అక్కడికి తీసుకు వెళ్లకుండా ఉంటే ఐదుగురి ప్రాణాలు పోయేవి కావని పలువురు భక్తులు అంటున్నారు.

**ఆలయ ఈవో తీరుపై సర్వత్రా విమర్శలు..**

గోదావరి ప్రాంతంలో పుష్కర ఘాట్‌ల వద్ద అధికారుల నిర్లక్ష్యం కొట్టిచ్చినట్టు కన్పిస్తున్నది. ఆలయ ఈవో కేవలం ఆలయానికే పరిమితమయ్యారని భక్తులు విమర్శిస్తున్నారు. గోదావరి తీరంలో ఇటీవల వరుస ఘటనలు జరుగుతున్న కనీసం స్పందించడం లేదంటున్నారు. ఘాట్‌ల వద్దపలు శాఖల సిబ్బంది, యంత్రాంగం లేకపోవడం, భక్తులకు అపా యం గురించి హెచ్చరించే విధంగా మైకుసెట్లు లేక పోవడం వంటివి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

## బాసర ఘటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి



నిర్మల్ జిల్లా బాసరలో గోదావరిలో స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందారు. ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. నిర్మల్ జిల్లా బాసర వద్ద గోదావరి నదిలో స్నానం చేస్తూ ఐదుగురు యువకుల మృతి చెందడం పట్ల తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ద్రిగ్బాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌కి ఓ చెందిన కుటుంబం బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వచ్చి ఆదివారం ఉదయం గోదావరిలో స్నానానికి వెళ్ళి ఐదుగురు యువకులు గల్లంతై మృతి చెందారని సమాచారం తీవ్రంగా కలిచివేసిందన్నారు మంత్రి పొన్నం. ప్రాజెక్టుల వద్దకు నదుల వద్దకు వెళ్ళినప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.

## బాసరలో భక్తుల మృతి దురదృష్టకరం : కలెక్టర్ అభిలాష అభినవ్



బాసర గోదావరి నదిలో యాత్రికుల మృతిపై కలెక్టర్ అభిలాష అభినవ్ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో హైదరాబాద్‌కు చెందిన భక్తులు బాసర దేవస్థాన దర్శనానికి వచ్చి గోదావరిలో స్నానం చేస్తుండగా ఐదుగురు మృతి చెందడం దురదృష్టకరమని తెలిపారు. గతం లోనే నది సమీపంలో మెట్లు ఏర్పాటు చేసిన ప్రాంతం మినహా ఇతర ప్రాంతాల్లో స్నానా లు నిషేధించామని పేర్కొన్నారు. భద్రతా పరంగా ఈ నిబంధనలను మరింత కఠినం గా అమలు చేస్తామని, ఇలాంటి సంఘట నలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే భైంసా ఆర్డీవోతో మాట్లాడినట్లు తెలిపారు. ఘటనపై సమీక్షించి, సహాయక చర్యలు తక్ష ణమే చేపట్టాలని అధికారులను ఆదేశించి నట్లు వెల్లడించారు. భక్తుల భద్రతకు సంబ ంధించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.





బాసర గోదావరి నదిలో చోటు చేసుకున్న దుర్ఘటనలోని మృతదేహాలకు ఆదివారం సాయంత్రం భైంసాలోని ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్ఠం పూర్తయ్యాక ఐదుగురు యువకులు మృతి చెందగా ఇందులో నుంచి రితిక్ అనే యువకుని మృతదేహాన్ని అంత్యక్రియల కోసం గాను హైదరాబాద్‌లోని దిల్‌సుక్‌నగర్‌కు తరలించారు. మిగతా వారి మృతదేహాలు అంత్యక్రియల కోసం గాను రాజస్థాన్ రాష్ట్రంలోని పాలి జిల్లా కేంద్రానికి 8కిలో మీటర్ల దూరంలోని స్వగ్రామానికి తరలించారు. కాగా భైంసాలో నివాసముంటున్న రాజస్థానీ యులు మృతుల కుటుంబాలకు ఇక్కడ అన్నీ తామై సహకరించారు. మృతదేహాలు ఇక్కడికి వచ్చిన సమాచారం అందుకున్న స్థానిక రాజస్థానీయులు అధిక సంఖ్యలో ఆసుపత్రికి తరలివచ్చారు. బాధితులకు అవసరమైన సహాయ, సహకారాలు అందించారు.

# భక్తజన సంద్రమైన బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి క్షేత్రం





**ముథోల్, జూన్ 13 (ప్రభాత సమాచారం)**
బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం వేలాది మంది అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సరస్వతీ, మహాలక్ష్మీ, మహాకాళీ అమ్మ వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ముందుగా గోదావరినదిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసం చేయించారు. అమ్మవారి దర్శనానికి మూడు గంటలు పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. చదువుల తల్లి కొలువై ఉన్న బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుండి భక్తులు తరలివచ్చారు. ముందుగా పవిత్ర గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి క్యూలో బారులు తీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాస మండపంలో అక్షరాభ్యాసం, కుంకుమార్చన పూజలు చేయించారు. 1000 రూపాయల ప్రత్యేక అక్షరాభ్యాసం 378 టికెట్లు, సాధారణ అక్షరాభ్యాసం 150 రూపాయల టికెట్లు 824, అద్దెగదులు, చండీ హోమం, శ్రీ సత్యనారాయణ పూజ, వాహన పూజ టికెట్ల ద్వారా రూ.12,07,210 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో తెలిపారు.

## ఎస్సైని సన్మానించిన గల్ఫ్ సంక్షేమ సమితి సభ్యులు



**జన్నారం, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి- ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన, ఎస్సై గొల్లపల్లి అనూషను రాష్ట్ర, మండల నాయకులతో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగిందని వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమయ్య తెలిపారు. ఈ సందర్భంగా కల్లెడ భూమయ్య మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రతలు, మహిళా భద్రత, సామాజిక న్యాయం పరిరక్షణకు ఎస్సై మరిన్ని సేవలు అందించాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అండగా నిలుస్తూ, న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషిస్తోందని, ఆ దిశగా ఎస్సై అనూష చక్కటి బాధ్యతతో ముందంజలో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సేపూర్ గోపాల్, అమరగొండ తిరుపతి, మహమ్మద్ హసన్, మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, జనరల్ సెక్రటరీ దుమ్మల ఎల్లయ్య మండల నాయకులు దుర్గం లచ్చన్న ఎండి ఖాదర్, నరేష్, రవి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు

## హైదరాబాద్‌లో యువకుడి ఆత్మహత్య

**-ముల్కల్లలో తీవ్ర ఉద్రిక్తత**
**-మహిళ ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన**
**-పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం**




**మంచిర్యాల, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటకు చెందిన దేవి ప్రశాంత్ (27) హైదరాబాద్‌లో శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సంఘటన వెనుక వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. దేవి ప్రశాంత్ బీటెక్ పూర్తి చేసి అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం ముల్కల్లకు చెందిన ఓ మహిళతో అతనికి పరిచయం ఏర్పడి అదికాస్తా వివాహేతర సంబంధంగా మారింది. మూడు నెలల క్రితం వివాహిత తన కుమారుడితో కలిసి హైదరాబాద్ వెళ్లగా, కుటుంబ సభ్యుల ఒత్తిడితో కుమారుడిని అప్పగించింది. పంచాయితీ తర్వాత ఇరువురూ విడివిడిగా ఉంటున్నా.. సోషల్ మీడియాలో చాటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో వారం క్రితం ఇరువురూ మరోసారి హైదరాబాద్ వెళ్లారు. దీంతో వివాహిత కుటుంబ సభ్యులు హాజీపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ప్రశాంత్ సోదరుడు రాజశేఖర్ సహాయంతో వివాహిత గురువారం ఇంటికి తిరిగి వచ్చింది. అయితే ప్రశాంత్ హాజీపూర్, మంచిర్యాల ప్రాంతాల్లో తిరిగి, చివరకు హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ ఉప్పల్ పోలీస్ స్టేషన్ నుంచి రాజశేఖర్‌కు ఫోన్ వచ్చింది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లిచూడగా ప్రశాంత్ విగతజీవిగా కనిపించాడు. అతని మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఆదివారం పోస్టుమార్టం అనంతరం అంబులెన్స్‌లో ప్రశాంత్ మృతదేహాన్ని గుడిపేటకు తీసుకొచ్చారు. దీంతో ప్రశాంత్ సహచర అంబులెన్స్ డ్రైవర్లు సంతాప సూచకంగా వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివాహిత కుటుంబ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడ్డారు. బాధిత కుటుంబ సభ్యులు వివాహిత తల్లిదండ్రుల ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లి ఆందోళన నిర్వహించారు. ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ప్రశాంత్ సోదరుడు రాజశేఖర్ తమ్ముడి మరణం ఆత్మహత్య కాదని, వివాహిత కుటుంబ సభ్యులు హత్య చేశారని ఆరోపిస్తున్నాడు. పోలీసుల జోక్యంతో పరిస్థితి అదుపులోకి మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్, మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, లక్సెట్టిపేట ఎస్సై గోపతి సురేశ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థి తిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి చర్యలు తీసుకుం టామని ఏసీపీ హామీ ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది.



## సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించాలి

**తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజి రెడ్డి**

**నస్పూర్, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, లాభాల్లో 30 శాతం వాటాను కార్మికులకు ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నస్పూర్‌లోని బీఆర్ఎస్ మంచిర్యాల కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.
ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో పెట్రేగిపోతున్న రాజకీయ జోక్యాన్ని తగ్గించాలన్నారు. మెడికల్ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని, సింగరేణి కార్మికులు, రిటైర్డ్ కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంస్థలోని అన్ని సింగరేణి ఆసుపత్రుల్లో మందులను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్మికులకు రిఫరల్ సౌకర్యాన్ని సులభతరం చేయాలని డిమాండ్ చేశారు. 2024 -25 ఆర్థిక సంవత్సరానికి వచ్చిన లాభాలను యాజమాన్యం వెంటనే ప్రకటించాలన్నారు. బదిలీల సర్క్యులర్ ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ఆ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, సంయుక్త కార్యదర్శి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పోగాకు రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

### ఏరియా ఉపాధ్యక్షుడిగా రమేష్ ఎన్నిక..

శ్రీరాంపూర్ ఏరియా తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా బండి రమేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ బైలాస్ ప్రకారం నూతన ఉపాధ్యక్షుడు ఎన్నుకోవడం జరిగిందని రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి వెల్లడించారు. శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా సేవలు అందించిన పెట్టెం లక్ష్మణ్ ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జి గోగుల రవీందర్ రెడ్డి, టీబీజీకేఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం'

**జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి**



**జన్నారం, జూన్ 15 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలో తెలంగాణ బీడి అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సమావేశం ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో దాసండ్ల రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంకు దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు జిల్లా కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో 7 లక్షల మంది కార్మికులు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయం తరువాత బీడీ పరిశ్రమ అతి పెద్దది. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమను కాపాడాల్సిన కేంద్ర బిజెపి ప్రభుత్వం ఆ పరిశ్రమను ధ్వంసం చేయడానికే కోస్టా చట్టం-2023ని తీసుకొచ్చింది. బీడీ కార్మికుల ఉపాధిని హరించే ఈ చట్టాన్ని ఉపసంహరించు కోవాలని సిఐటియు డిమాండ్ చేస్తున్నది. కోటపా చట్టం- 2023 ప్రతిపాదించిన సవరణల ప్రకారం బీడీ కట్టలపై ఉత్తర్వుల గురించి ఉత్పత్తిదారులు ప్రచారం చేసుకోరాదు. బీడీ కట్టలు పబ్లిక్ దుకాణాల్లో ఉండరాదు. 20సం॥ఎరాల కంటే తక్కువ వయసున్న వారికి బీడీలు అమ్మడానికి వీలులేదు. లూజుబీడీలు అమ్మడానికి వీలులేదు. కట్టలు మాత్రమే అమ్మాలి. బీడీ కట్టలలో బీడీల సంఖ్యను ప్రభుత్వం నిర్దేశిస్తుంది. ఈ సవరణలు అమలు జరిగితే బీడీ అమ్మకాలుతగ్గి, కార్మికులకు ఉపాధి పోతుంది. ఇది పెద్దసంక్షోభానికి దారి తీస్తుంది. కాబట్టి కోపా చట్టం సవరణలను ఉపసంహరించుకోవాలని లేదంటే కార్మికులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతున్నాం. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10సం?లు గడుస్తున్నది. 3వ సారి కూడా అధికారంలోకి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. అందుకే కేంద్ర ప్రభుత్వంపై పెద్దఎత్తున ఒత్తిడి తెచ్చి %ఖూూ%చట్టం-2023ను ఉపసంహరించుకోవాలి. బీడీ వెల్ఫేర్ సెస్సు యాక్టు పునరుద్ధరించాలని, కనీస పెన్షన్ ఇవ్వాలని 2025 జూలై 9న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో బీడీ కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ అంబాల లక్ష్మణ్, బుచ్చన్న సీఐటీయూ సీనియర్ నాయకులు, బీడీ కార్మికులు లక్ష్మి,సరస్వతి, సుజాత సరిత లత సువర్ణ, లావణ్య సత్తవ్వ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
సోమవారం
। 16 జూన్ । 2025
https: epaper.prabhathasamacharam.com



# జనహృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజల కోసం పరితపించే నేత, ప్రజల అవసరాలను గుర్తించి, సంక్షేమ, అభివృద్ధి కార్యకమ్రాలు చేపడుతున్న పీపుల్స్ ఎమ్మెల్యే, ఖానాపూర్ శాసన సభ్యులు

**శ్రీ వెడ్మ బొజ్జు పటేల్** గారికి జన్మదిన శుభాకాంక్షలు.



ఎమ్మెల్యే శ్రీ వెడ్మ బొజ్జు పటేల్ ఏడాది కాలంలో తీసుకొచ్చిన నిధులు, అభివృద్ధి పనులు

## రూ.1042 కోట్ల నిధులతో అభివృద్ధి

1: ఏడాదిన్నర కాలంలో ఖానాపూర్ నియోజవర్గంలో వివిధ శాఖల ద్వారా అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు నియోజకవర్గానికి రూ.॥1042 కోట్లు మంజూరు చేయబడ్డాయి.

2: సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన లబ్ధిదారులందరికి అందించడం జరుగుతుంది

3: పంచాయతీ రాజ్, సాంఘిక సంక్షేమం, ట్రైబల్‌వెల్ఫేర్, ఆర్అండ్‌బి, నీటిపారుదల, కార్మిక, వైద్య ఆరోగ్య శాఖల ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం, డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, సీపీఆర్, సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ నిధులు రూ.॥ 257.59 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం, రోడ్ల మరమ్మతులు, పాఠశాల అదనపు గదుల నిర్మాణం, నాగోబా ఆలయం ఆధునీకరణ, ఇంద్రవెల్లి స్తూపానికి పర్యాటక శోభ, నర్సింగాపూర్ బ్రిడ్జి, బాదన్‌పల్లి బ్రిడ్జి, లక్కారం, చింతగూడ బీటీ రోడ్డు, పాఠశాలలకు వసతులతో పాటు ఆర్అండ్‌బి ఆధ్వర్యంలో కవ్వాలలో తవ్వే బ్రిడ్జి, కడెం గంగాపూర్ బ్రిడ్జి, ఖానాపూర్ పసుపుల బ్రిడ్జితో పాటు ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేసి, సౌకర్యాలు మెరుగు పరిచేందుకు రూ.॥8 కోట్లతో పనులు మంజూరు చేయబడినది.

4: ఉట్నూర్‌లో రూ.॥5కోట్లతో ఐటీఐ భవన నిర్మాణం చేపట్టడమైంది. జన్నారం ఐటీఐలో సౌకర్యాలు.

5: రైతు భరోసా పథకం కింద నియోజకవర్గంలో రూ.॥66.26కోట్లతో 35వేల రైతులకు పంపిణీ చేయడం జరిగింది

6: రైతు బీమా పథకం కింద 232మందికి రూ.॥11.60 కోట్లు పంపిణీ చేయడం జరిగింది.

7: రైతు రుణమాఫీ పథకం కింద 11780 మంది రైతులకు రూ.॥112 కోట్లు మాఫీ చేయడం జరిగింది.

8: గృహజ్యోతి పథకం కింద నియోజకవర్గంలో 49వేల మంది లబ్ధిదారులకు రూ.॥1.70 కోట్ల సబ్సిడీ అందించడం జరిగింది.

9: సీఎంఆర్ఎఫ్ కింద నియోజకవర్గంలో ఇప్పటి వరకు రూ.॥2.46 కోట్లు పేద రోగులకు ఆర్థిక సాయం అందించడం జరిగింది. మరియు లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ) రూ.॥1.40 కోట్లు అందించడం జరిగింది.

10: ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నియోజకవర్గంలో 3500 మంది పేద లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేయబడ్డాయి. ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.॥5 లక్షలు ఆర్థిక సాయం అందిస్తున్నది.

11: విద్యా ప్రమాణాలు పెంచి, పేద విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.॥200 కోట్లు మంజూరు చేసింది. స్థల సేకరణ కూడా జరిగింది. పనులు త్వరలో ప్రారంభమవుతాయి.























## కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఖానాపూర్ నియోజకవర్గం